# శుభోదయం

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 02, సంచిక : 150, పేజీలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) మంగళవారం -12 - ఆగష్టు - 2025


## రౌడీ రాజకీయాలు తప్ప ప్రజల అభిమానాన్ని, మనసును గెలుచుకోలేరు

### కుట్రలు, దౌర్జన్యాలు, దాడులు, అబద్ధాలు, మోసాలు, వెన్నుపోట్లతో కుర్చీ లాక్కుంటారు

- అప్రజాస్వామిక, అరాచకవాది చంద్రబాబు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మండిపాటు
- ఇందుకు పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాల ఉప ఎన్నికల్లో బరితెగింపే సాక్ష్యం
- టీడీపీ అరాచక గ్యాంగ్‌లతో కలిసి చేసే దారుణాలతో ఉప ఎన్నికలను హైజాక్ చేసే కుట్ర
- ఇదివరకెన్నడూ లేని విధంగా వందలాది మంది వైఎస్సార్‌సీపీ నేతల బైండోవర్
- ఈనెల 5న ఓ పెళ్లికి వెళ్లిన అమరేష్ రెడ్డి, సైదాపురం సురేష్ రెడ్డిపై దాడి
- అడ్డుకోబోయిన పెళ్లి వారిపై, శ్రీకాంత్, నాగేశ్, తన్మోహన్ రెడ్డి తదితరులపైనా దాడి



అమరావతి: చంద్రబాబు అనే వ్యక్తి ఒక అప్రజాస్వామిక, అరాచక వాది అని.. రౌడీ రాజకీయాలు తప్ప ప్రజల అభిమానాన్ని, ప్రజల మనసును గెలుచుకుని రాజకీయాలు చేయరని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. కుట్రలు చేసి, దాడులు, దౌర్జన్యాలు చేసి, అబద్ధాలు చెప్పి, మోసాలు చేసి, వెన్నుపోట్లు పొడిచి కుర్చీని లాక్కోవాలని చూస్తున్నారనడానికి మరోమారు మన కళ్లెదుటే రుజువులు కనిపిస్తున్నాయంటూ దెప్పి పొడిచారు. పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాల ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యానికి పాతర వేస్తూ ఆయన చేస్తున్న నిస్సిగ్గు, బరితెగింపు రాజకీయాలే దీనికి సాక్ష్యాలు అంటూ ఎత్తిచూపారు. ముఖ్యమంత్రిగా తనకున్న అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరగనీయకుండా, కుట్ర పూరితంగా, అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు, ఆయన అడుగులకు మడుగులొత్తే కొంత మంది అధికారులు, టీడీపీ అరాచక గ్యాంగులు, ఈ గ్యాంగులకు కొమ్ముకాసే మరికొంత మంది పోలీసులు.. వీరంతా ఒక ముఠాగా ఏర్పడి అక్కడి ఎన్నికను హైజాక్ చేయడానికి దుర్మార్గాలు, దారుణాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాల ఉప ఎన్నికల్లో మిగతా..2లో

## 60 ఏళ్ల ఆదాయపు పన్ను చట్టానికి స్వస్తి..

### లోక్‌సభలో కొత్త బిల్లు పాస్

- ప్రతిపక్షాల తీవ్ర నిరసనల మధ్య లోక్‌సభలో రెండు కీలక ఆర్థిక బిల్లులు పాస్
- మూజువాణి ఓటుతో ఆదాయపు పన్ను బిల్లు, పన్నుల చట్టాల సవరణ బిల్లుకు ఆమోదం
- ఆరు దశాబ్దాల నాటి 1961 ఆదాయపు పన్ను చట్టం స్థానంలో కొత్త చట్టం
- ఎన్నికల జాబితాల ప్రత్యేక సవరణను వ్యతిరేకిస్తూ విపక్షాల ఆందోళన
- సౌదీ అరేబియా పెట్టుబడులకు పన్ను మినహాయింపులు కల్పించే సవరణలు
- వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న కొత్త ఆదాయపు పన్ను చట్టం



ఢిల్లీ: ప్రతిపక్ష సభ్యుల తీవ్ర నిరసనలు, నినాదాల మధ్యే కేంద్ర ప్రభుత్వం రెండు కీలక ఆర్థిక బిల్లులను లోక్‌సభలో ఆమోదింపజేసుకుంది. సోమవారం సభలో తీవ్ర గందరగోళం నెలకొన్నప్పటికీ, ఆదాయపు పన్ను బిల్లు-2025, పన్నుల చట్టాల (సవరణ) బిల్లు-2025 మూజువాణి ఓటుతో ఆమోదం పొందాయి. ఎన్నికల జాబితాల ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వ్యతిరేకిస్తూ విపక్షాలు ఆందోళనకు దిగాయి. సోమవారం సాయంత్రం 4 గంటలకు సభ ప్రారంభమైన వెంటనే, కేంద్ర ఆర్థిక మంత్రి మిగతా..2లో

## తెలంగాణకు నష్టం కల్గించే బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకుంటాం

- సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ ఫిర్యాదుతో బనకచర్ల ప్రాజెక్టు అనుమతులు నిలిచిపోయాయన్న భట్టి
- రాయలసీమ ఎత్తిపోతల పథకాల వల్ల 25 రోజుల్లో శ్రీశైలం డ్యామ్ ఖాళీ అవుతుందన్న భట్టి
- రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ఏపీ ప్రభుత్వం నిలిపివేయాలన్న భట్టి



హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు నష్టం వాటిల్లుతుందని, కాబట్టి ఆ ప్రాజెక్టును అడ్డుకొని తీరుతామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం నిర్మాణం కూడా ఏపీ ప్రభుత్వం నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫిర్యాదుతో బనకచర్ల ప్రాజెక్టు అనుమతులు నిలిచిపోయాయని భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం జిల్లా మిగతా..2లో


2లో

## మోదీ ఓట్ల దొంగ కాబట్టే మౌనంగా ఉన్నారు: షర్మిల

ఓట్ చోర్ క్యాంపెయిన్ ను ప్రతి ఇంటికి చేరుస్తాం

నకిలీ ఓటర్ల జాబితా ఎందుకు తారుమారయిందని ప్రశ్న

బీజేపీ చేతిలో ఈసీ కీలుబొమ్మగా మారిందని విమర్శ

## రాహుల్‌కు నోటీసులా? వాళ్లెవరు?

### ఈసీపై డీకే శివకుమార్ ఫైర్

- ఓట్ల మోసం ఆరోపణలపై రాహుల్ గాంధీకి కర్ణాటక ఈసీ నోటీసులు
- రాహుల్‌కు నోటీసులిచ్చే అధికారం ఎన్నికల సంఘానికి లేదన్న డీకే శివకుమార్
- అవసరమైతే మేమే ఈసీకి నోటీసులు ఇస్తామంటూ డీకే హెచ్చరిక
- షకున్ రాణి అనే మహిళ రెండుసార్లు ఓటేశారని రాహుల్ ఆరోపణ
- ఆరోపణలపై ఆధారాలు సమర్పించాలని రాహుల్‌ను కోరిన ఎన్నికల అధికారి



కర్ణాటక: లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి కర్ణాటక రాష్ట్ర ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేయడంపై ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తీవ్రంగా స్పందించారు. రాహుల్ గాంధీకి నోటీసులు ఇచ్చే అధికారం ఎన్నికల సంఘానికి మిగతా..2లో

## రాహుల్ గాంధీ అరెస్ట్.. ఢిల్లీలో హైటెన్షన్

### ఇండియా కూటమి ర్యాలీ.. ఎంపీలు అరెస్ట్!

- ఈసీ కార్యాలయానికి కూటమి ఎంపీల ర్యాలీ
- అడ్డుకున్న పోలీసులు.. ఖర్గే, అఖిలేశ్ యాదవ్ సహా పలువురి అరెస్ట్
- ప్రత్యేక బస్సుల్లో పోలీస్ స్టేషన్ కు తరలించిన పోలీసులు




న్యూఢిల్లీ: ఎలక్షన్ కమిషన్ ఆఫీస్ వరకూ ఇండియా కూటమి చేపట్టిన ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. ఈరోజు(సోమవారం, ఆగస్టు 11వ తేదీ) పార్లమెంట్ భవనం నుంచి ఎన్నికల సంఘం కార్యాలయానికి ర్యాలీగా బయలుదేరిన కూటమి ఎంపీలను పోలీసులు అడ్డుకున్నారు. లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే, సమాజ్ వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ సహా పలువురు కీలక నేతలను అరెస్టు చేశారు. ప్రత్యేక బస్సుల్లో వారిని పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ అరెస్టుల నేపథ్యంలో ఢిల్లీలో హైటెన్షన్ నెలకొంది. లోక్ సభ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని ఇండియా కూటమి నేతలు ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. బీజేపీతో కలిసి ఎన్నికల కమిషన్ ఓట్ల చోరీకి పాల్పడుతుందని ఆరోపించిన కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ.. ఆ క్రమంలోనే ఈసీ కార్యాలయానికి మార్చ్‌గా వెళ్లి మెమోరాండం ఇవ్వాలని పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా ఆ ఎంపీలంతా పార్లమెంట్ నుంచి ఈసీ కార్యాలయం వరకూ ర్యాలీకి పిలుపునిచ్చిన తరుణంలో ఇండియా కూటమి ఎంపీలు పాల్గొన్నారు. మిగతా..2లో





## రేవంత్ రెడ్డికి తెలంగాణ హైకోర్టులో ఊరట

- ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు
- 2019 అక్టోబర్ లో సూర్యాపేట జిల్లాలో రేవంత్ పై కేసు నమోదు
- కేసును కొట్టివేస్తూ తీర్పును వెలువరించిన హైకోర్టు

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. 2019 అక్టోబర్ లో సూర్యాపేట జిల్లా గరిడేపల్లి పరిధిలో ఎన్నికల కోడ్ ను ఉల్లంఘించారంటూ రేవంత్ పై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, ఆ కేసును కొట్టివేయాలని రేవంత్ రెడ్డి క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ క్రమంలో రేవంత్ పిటిషన్ పై ధర్మాసనం పలుమార్లు విచారణ చేపట్టింది. ఇరుపక్షాల వాదనలను విన్న హైకోర్టు కేసును కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది.

## కొంచెం తెలివి ఉంటే ఉపయోగించాలి..


2లో..

లేదంటే తెలివి ఉన్నవారిని పక్కన పెట్టుకోవాలి..

రాహుల్ గాంధీపై కిరణ్ కుమార్ రెడ్డి సెటైర్లు

రాహుల్ ఆరోపించినట్లు రిగ్గింగ్ జరిగితే 400కిపైగా స్థానాలు రావాలి కదా అన్న కిరణ్ కుమార్ రెడ్డి

ప్రజలు చాలా తెలివైన వారన్న కిరణ్ కుమార్ రెడ్డి

రాహుల్ ఆటంబాంబు పేలుడు తుస్సు మందన్న కిరణ్ కుమార్ రెడ్డి

## నిండుకుండల్లా శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులు

కళకళలాడుతున్న కృష్ణా పరివాహక ప్రాజెక్టులు

జూరాల, సుంకేసుల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు క్రమంగా వరద నీరు

8 గేట్లు ఎత్తి నీటి విడుదల

శ్రీశైలం ఇన్‌ఫ్లో 1,99,714 క్యూసెక్కులు కాగా.. ఔట్ ఫ్లో 1,00,800 క్యూసెక్కులు


2లో

# నిండుకుండల్లా శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులు

నాగార్జునసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కృష్ణా పరివాహక ప్రాజెక్టులు కళకళలాడుతున్నాయి. జూరాల, సుంకేసుల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు క్రమంగా వరద నీరు పెరుగుతోంది. శ్రీశైలం ఇన్‌ఫ్లో 1,99,714 క్యూసెక్కులు కాగా.. ఔట్ ఫ్లో 1,00,800 క్యూసెక్కులుగా ఉంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 35 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ఎడమగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 30,485 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 881.20 అడుగుల నీటిమట్టం ఉంది. పూర్తి నీటినిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలకు గానూ.. ప్రస్తుతం 194.30 టీఎంసీల నీరు ఉంది.

8 గేట్లు ఎత్తి నీటి విడుదల

మరోవైపు నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండను తలపిస్తోంది. శ్రీశైలం నుంచి సాగర్‌కు వరద ప్రభావం పెరిగింది. దీంతో 8 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 64,465 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్‌కు 65,800 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా.. 1,10,483 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి, ప్రస్తుత నీటి మట్టాలు 590 అడుగులుగా ఉన్నాయి. సాగర్ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలు కాగా, ప్రస్తుతం అంతే స్థాయిలో నీరు నిల్వ ఉంది.

# కొంచెం తెలివి ఉంటే ఉపయోగించాలి..

హైదరాబాద్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై బీజేపీ నేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి విమర్శలు గుప్పించారు. కేంద్రంలోని బీజేపీని, ఎన్నికల సంఘాన్ని రాహుల్ గాంధీ విమర్శించడంపై కిరణ్ కుమార్ రెడ్డి స్పందించారు. రాయచోటిలో నిన్న కిరణ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాహుల్ గాంధీపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రోజురోజుకు రాహుల్ గాంధీ విజ్ఞత ఏమవుతోందో అర్థం కావడం లేదని అన్నారు. ఆర్భాటంగా మొదలై తుస్సుమని పోయిందని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ రిగ్గింగ్ చేసుకుని, ఎన్నికల సంఘంతో కుమ్మక్కై మూడోసారి అధికారంలోకి వచ్చిందని రాహుల్ అనడాన్ని కిరణ్ కుమార్ రెడ్డి తప్పుబట్టారు. ఈ మాటలు అనడానికి ఆయనకు కొంచెమైనా బుద్ధి ఉండాలని ప్రశ్నించారు. 2014లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడే దాదాపు 282 స్థానాలు బీజేపీ గెలుచుకుని 35 సంవత్సరాల తర్వాత మొట్టమొదటిసారిగా ఒక పార్టీ పూర్తి మెజార్టీతో అధికారంలోకి వచ్చిందన్నారు. 2019 ఎన్నికల్లో ఏకంగా 303 సీట్లు గెలుచుకుని అంతకుముందు కంటే ఎక్కువ మెజార్టీ సాధించిందన్నారు. 2024 ఎన్నికల్లో రాహుల్ గాంధీ ఆరోపించినట్లు రిగ్గింగ్ జరిగితే 400లకు పైగా సీట్లు రావాలి కానీ 240 సీట్లు ఎలా వస్తాయని ప్రశ్నించారు. 2009లో ఏపీలో ఒకేసారి ఎన్నికలు జరిగితే అసెంబ్లీ ఎన్నికల్లో 156 సీట్లు కాంగ్రెస్ గెలిచిందని, 33 పార్లమెంట్ స్థానాలు వచ్చాయని తెలిపారు. పార్లమెంట్‌లో 194 సీట్లు మెజార్టీ వచ్చిందని, ఒకేసారి ఒకే రోజు ఎన్నికలు జరిగితే 38 అసెంబ్లీ సెగ్మెంట్లలో పార్లమెంట్ కు మెజార్టీ వచ్చిందని, అసెంబ్లీకి తక్కువ మెజార్టీ వచ్చిందని దీన్ని ఏమంటారు..? రిగ్గింగ్ అంటారా..? అని ప్రశ్నించారు. ప్రజలు చాలా తెలివైన వారని కిరణ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఆయన మాట్లాడే మాటలు నాకే అర్థం కావడం లేదని అన్నారు. కొంచెం తెలివి ఉంటే ఉపయోగించాలి.. లేదంటే తెలివి ఉన్న వారిని పక్కన పెట్టుకోవాలంటూ రాహుల్‌కు కిరణ్ కుమార్ రెడ్డి సలహా ఇచ్చారు.

## మోదీ ఓట్ల దొంగ కాబట్టే మౌనంగా ఉన్నారు: షర్మిల

అమరావతి: బీజేపీ, ఈసీకి వ్యతిరేకంగా'ఓట్ చోర్ క్యాంపెయిన్'ను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఏపీలో సైతం ఈ కార్యక్రమాన్ని ప్రతి గడపకు చేరుస్తామని ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల తెలిపారు. ఓట్ల దొంగ మోదీ తీరును, బీజేపీ కోసం అధికార దుర్వినియోగం చేసిన ఎన్నికల కమిషన్ వైఖరిని ఎండగడతామని చెప్పారు. ప్రజాస్వామ్యమే ఈసీకి ముఖ్యమని భావిస్తే... రాహుల్ గాంధీ లేవనెత్తిన సందేహాలకు బదులివ్వాలని డిమాండ్ చేశారు. నకిలీ ఓటర్ల జాబితా ఎందుకు తారుమారయిందని షర్మిల ప్రశ్నించారు. డిజిటల్ ఓటర్ జాబితాను ఎందుకు ఇవ్వడం లేదని మండిపడ్డారు. ప్రతిపక్ష నేతలను ఎందుకు బెదిరిస్తున్నారని ప్రశ్నించారు. బీజేపీకి ఎన్నికల సంఘం ఏజెంట్ గా మారిందా? అని నిలదీశారు. దొడ్డిదారిలో గెలుపు కోసం ఎన్నికల కమిషన్ నే బీజేపీ కలుషితం చేసిందని షర్మిల మండిపడ్డారు. స్వతంత్ర వ్యవస్థ అయిన ఈసీ బీజేపీ చేతిలో కీలుబొమ్మగా మారిందని, ఆర్ఎస్ఎస్ లాంటి అనుబంధ సంస్థల జాబితాలో చేరిందని విమర్శించారు. మోదీ ఓట్ల దొంగ కాబట్టే మౌనంగా ఉంటున్నారని అన్నారు.

# 60 ఏళ్ల ఆదాయపు పన్ను చట్టానికి స్వస్తి..

మొదటి పేజి తరువాయి

సోమవారం సాయంత్రం 4 గంటలకు సభ ప్రారంభమైన వెంటనే, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ రెండు బిల్లులను ప్రవేశపెట్టారు. అదే సమయంలో ప్రతిపక్ష సభ్యులు "ఓట్ల దొంగతనం ఆపండి", "ఎస్ఐఆర్ వాపస్ తీసుకోండి" అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ గందరగోళం నడుమనే స్పీకర్ స్థానంలో ఉన్న సంధ్యా రాయ్ బిల్లులపై ఓటింగ్ ప్రక్రియను పూర్తి చేశారు.

### 60 ఏళ్ల చట్టం స్థానంలో కొత్త బిల్లు

కొత్తగా ఆమోదం పొందిన ఆదాయపు పన్ను బిల్లు, 2025, గత ఆరు దశాబ్దాలుగా అమల్లో ఉన్న 1961 నాటి చట్టం స్థానంలోకి రానుంది. బీజేపీ ఎంపీ బైజయంత్ పండా నేతృత్వంలోని పార్లమెంటరీ సెలెక్ట్ కమిటీ చేసిన 285 సిఫార్సులను ఈ కొత్త బిల్లులో పొందుపరిచారు. ఈ బిల్లు ద్వారా పన్నుల భాషను సరళతరం చేయడం, మినహాయింపులపై స్పష్టత ఇవ్వడం, గృహ రుణంపై వడ్డీ, ప్రామాణిక తగ్గింపులు వంటి విషయాల్లో ఉన్న సందిగ్ధతలను తొలగించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కొత్త చట్టం 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుందని ప్రభుత్వం ప్రకటించింది.

### పన్నుల చట్టాల సవరణ బిల్లులో కీలక మార్పులు

దీంతో పాటు ఆమోదం పొందిన పన్నుల చట్టాల (సవరణ) బిల్లు ద్వారా పలు సంస్కరణలు చేపట్టారు. యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్) చందాదారులకు కూడా న్యూ పెన్షన్ స్కీమ్ (ఎన్‌పీఎస్) తరహాలోనే పన్ను మినహాయింపులు వర్తింపజేయనున్నారు. అలాగే, భారత్‌లో పెట్టుబడులు పెట్టే సౌదీ అరేబియాకు చెందిన పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్‌కు ప్రత్యక్ష పన్నుల నుంచి ఉపశమనం కల్పించారు. ఆదాయపు పన్ను సోదాల కేసుల్లో బ్లాక్ అసెస్‌మెంట్‌కు సంబంధించిన నిబంధనలను కూడా ఈ బిల్లు ద్వారా క్రమబద్ధీకరించారు. బిల్లుల ఆమోదం అనంతరం కూడా ప్రతిపక్షాల ఆందోళనలు కొనసాగడంతో సభను మంగళవారానికి వాయిదా వేశారు. మరోవైపు, యువతలో అధికమవుతున్న మొబైల్ ఫోన్ల వాడకం, ఇంటర్నెట్‌లో అశ్లీల సమాచారం వంటి అంశాలపై చర్చల అనంతరం రాజ్యసభ కూడా వాయిదా పడింది.

# తెలంగాణకు నష్టం కల్గించే బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకుంటాం

మొదటి పేజి తరువాయి

బనకచర్ల ప్రాజెక్టు అనుమతులు నిలిచిపోయాయని భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం జిల్లా మధిర మండలం వంగవీడు గ్రామ సమీపంలోని వైరా నదిపై రూ.630 కోట్లతో నిర్మించనున్న జవహర్ ఎత్తిపోతల పథకానికి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వాకిటి శ్రీహరి, ఎంపీ పోరిక బలరాం నాయక్, పలువురు ఎమ్మెల్యేలతో కలిసి నిన్న భట్టి శంకుస్థాపన చేశారు. అనంతరం ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీ, దేవాదుల ప్రాజెక్టులను సందర్శించి సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ ఎత్తిపోతల పథకాల ద్వారా ఏపీ ప్రభుత్వం రోజుకు 11 టీఎంసీల నీటిని ఆంధ్రాకు తరలిస్తే 25 రోజుల్లో శ్రీశైలం ప్రాజెక్టు ఖాళీ అవుతుందని, దీని వల్ల నల్లగొండ, ఖమ్మం జిల్లాల రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు.

# రాహుల్‌కు నోటీసులా? వాళ్లెవరు?

మొదటి పేజి తరువాయి

రాహుల్ గాంధీకి నోటీసులు ఇచ్చే అధికారం ఎన్నికల సంఘానికి లేదని ఆయన సోమవారం స్పష్టం చేశారు. అవసరమైతే తామే ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. బెంగళూరులో విలేకరులతో మాట్లాడుతూ, "రాహుల్ గాంధీకి నోటీసులు ఇవ్వడానికి వాళ్లెవరు? వాళ్లను నోటీసులు ఇవ్వమనండి. నోటీసులు ఇచ్చే అధికారం మాకుంది, మేమే వాళ్లకు నోటీసులు పంపిస్తాం" అని డీకే శివకుమార్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యబద్ధంగా తాము ఎన్నికల్లో గెలిచామని, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించే హక్కు మాత్రమే ఈసీకి ఉందని, తమకు నోటీసులు జారీ చేసే హక్కు లేదని ఆయన అన్నారు. ఈసీ నోటీసులపై చట్టపరంగా స్పందిస్తామని తెలిపారు.

### అసలేం జరిగింది?

ఎన్నికల్లో మోసం జరిగిందంటూ రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలకు సంబంధించి ఆధారాలు సమర్పించాలని కోరుతూ కర్ణాటక రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) వి. అన్బుకుమార్ ఆదివారం ఆయనకు నోటీసులు జారీ చేశారు. ఆగస్టు 7న ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో షకున్ రాణి అనే మహిళ రెండుసార్లు ఓటు వేశారని రాహుల్ ఆరోపించారు. పోలింగ్ అధికారి రికార్డుల ప్రకారమే తాను ఈ విషయం చెబుతున్నానని, అందుకు సంబంధించిన పత్రాన్ని కూడా ప్రదర్శించారు. అయితే, రాహుల్ చూపించిన పత్రం అధికారికమైనది కాదని సీఈఓ తన నోటీసులో పేర్కొన్నారు. తాము జరిపిన ప్రాథమిక విచారణలో షకున్ రాణి ఒక్కసారే ఓటు వేసినట్లు తేలిందని వివరించారు. ఈ నేపథ్యంలో, షకున్ రాణి గానీ, మరెవరైనా గానీ రెండుసార్లు ఓటు వేశారని నిర్ధారణకు రావడానికి మీ వద్ద ఉన్న ఆధారాలను, సంబంధిత పత్రాలను సమర్పించాలని రాహుల్ గాంధీని ఆ నోటీసులో కోరారు. దీని ఆధారంగా తాము పూర్తిస్థాయి విచారణ చేపడతామని తెలిపారు. ఈ నెల 8న జరిగిన ఓ ర్యాలీలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, గత 10 ఏళ్ల ఎలక్ట్రానిక్ ఓటర్ల జాబితాను, వీడియో రికార్డింగ్‌లను భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) బయటపెట్టాలని డిమాండ్ చేశారు. అలా చేయకపోతే, ఈసీఐ నేరాన్ని దాచిపెడుతున్నట్లేనని ఆయన ఆరోపించారు.

# రాహుల్ గాంధీ అరెస్ట్.. ఢిల్లీలో హైటెన్షన్

దీనిలో భాగంగా ఆ ఎంపీలంతా పార్లమెంట్ భవనం నుంచి సుమారు కిలోమీటర్ దూరం మాత్రమే ఉన్న ఈసీ కార్యాలయానికి మార్చ్‌గా వెళ్లే క్రమంలో వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీనిలో భాగంగా ఇండియా కూటమి ఎంపీలను అరెస్ట్ చేశారు. అనంతరం విడుదల చేశారు. అరెస్ట్ అయిన వారిలో కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గేతో పాటు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ అఖిలేష్ యాదవ్, శివసేన(ఎల్‌బీటీ) నేత ప్రియాంకా చతుర్వేది తదితరులు ఉన్నారు. ఈ అంశంపై రాహుల్ గాంధీ మీడియా మాట్లాడుతూ.. ' ఇది రాజకీయంగా చూడాల్సిన అంశం కాదు. మన రాజ్యాంగాన్ని మనం పరిరక్షించుకోవాల్సిన సమయం. ఈ పోరాటం ఏదో రాజకీయ దురుద్దేశంతో చేసేది ఎంతమాత్రం కాదు. ఇది కేవలం వన్ పర్సన్.. వన్ ఓట్ అనే దానిపైనే మా ఉద్యమం' అని స్పష్టం చేశారు. తాము 300 ఎంపీలం కలిసి ఈసీ కార్యాలయానికి వెళ్లాలని అనుకుంటే తమకు అనుమతి ఇవ్వలేదన్నారు. కొంతమందిని మాత్రమే రమ్మంటున్నారని ఆయన మండిపడ్డారు. తమ పోరాటం బోగస్ ఓట్లపైనేనని, తమ వద్ద డేటా ఉందని రాహుల్ మరోసారి స్పష్టం చేశారు.

### ఈసీని 30 మంది ఎంపీలు కలవొచ్చు..

ఇండియా కూటమి ర్యాలీపై డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ దేవేశ్ కుమార్ మహ్లా స్పందించార. ఎలక్షన్ కమిషన్‌ను 30 మంది ఎంపీలు కలవొచ్చు అదే విషయాన్ని ఈసీ కూడా చెప్పింది. అంతే గానీ ర్యాలీగా 300 మంది ఎంపీలు ర్యాలీగా వెళితే లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తుందంది. ఆ క్రమంలోనే వారిని అదుపులోకి తీసుకున్నాం'అని డిప్యూటీ కమిషనర్ తెలిపారు.




### స్పష్టమైన ఓటర్ల జాబితాను డిమాండ్ చేస్తున్నా:

ప్రతి భారతీయుడికి ఓటు హక్కు కోసం ప్రతిపక్షాలు నిరసన తెలుపుతున్నాయని, స్పష్టమైన ఓటర్ల జాబితాను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నానని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. కర్ణాటకలో తమ పార్టీ అధికారంలోకి వచ్చాక ఓ నియోజక వర్గంలో సర్వే నిర్వహించగా.. దాదాపు లక్ష నకిలీ ఓట్లు తేలాయన్నారు. ఈ నిజం దేశం ముందున్నా .. ఎన్నికల సంఘం మాత్రం దీనిపై మౌనం వహించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. బిహార్‌లో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణను వ్యతిరేకిస్తూ దేశ రాజధాని ఢిల్లీలో విపక్ష ఎంపీలు 'పార్లమెంట్ టు ఈసీ' ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీకి అనుమతి లేదంటూ పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో ప్రతిపక్ష ఎంపీలు బారికేడ్లు ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. దీంతో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా విపక్ష ఎంపీలను అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి బస్సులో తరలించారు. ఇది రాజకీయ పోరాటం కాదు, రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడుతున్నామని ఆయన తెలిపారు. 'ఒక మనిషి , ఒక ఓటు' కోసం ఈ పోరాటం చేస్తున్నామన్నారు. స్పష్టమైన ఓటర్ల జాబితాను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.

# రౌడీ రాజకీయాలు తప్ప ప్రజల అభిమానాన్ని, మనసును గెలుచుకోలేరు

పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాల ఉప ఎన్నికల్లో చంద్రబాబు అమలు చేస్తున్న కుట్రపూరిత పన్నాగాన్ని సాక్ష్యాధారాలతో వివరిస్తూ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆ పోస్టులో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే.. పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాల ఉప ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చింది మొదలు పోలీసుల అరాచకాలు పెరిగిపోయాయి. వందల మంది వైఎస్సార్‌సీపీ నాయకులను, కార్యకర్తలను బైండోవర్ చేశారు. తమ జీవితంలో ఎప్పుడూ పోలీస్‌స్టేషన్ గడప తొక్కని వారిని, ఎలాంటి కేసులు లేని వారిని కూడా బైండోవర్ చేసి, వైఎస్సార్‌సీపీ తరఫున పని చేస్తున్న వారిని, ప్రచారం చేస్తున్న వారిని పోలీసులను ఉపయోగించుకుంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఇది ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. ఎన్నికల్లో భయాన్ని నింపడానికి ఆగస్టు 5న పులివెందులలో ఓ వివాహానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులపై టీడీపీ గ్యాంగులు దాడి చేశాయి. ఈ ఘటనలో అమరేష్ రెడ్డి, సైదాపురం సురేష్ రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. అడ్డుకోబోయిన పెళ్లి వారిని, శ్రీకాంత్, నాగేశ్, తన్మోహన్ రెడ్డి తదితరులపైనా దాడికి దిగారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున పని చేస్తే ఇలానే దాడులు చేస్తామంటూ హెచ్చరికగా దీనికి పాల్పడ్డారు. ఆగస్టు6న ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న బీసీ యాదవ సామాజిక వర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు వేల్పుల రామలింగారెడ్డిలను హత్య చేయడమే లక్ష్యంగా నల్లగొండువారిపల్లి వద్ద వారు ప్రయాణిస్తున్న కారుపై టీడీపీ గ్యాంగులు కర్రలు, రాళ్లు, రాడ్లతో దాడి చేసి, వీరిని తీవ్రంగా గాయపరిచారు. కారుని బద్దలు కొట్టారు. పెట్రోల్ పోసి ఆ కారుకు నిప్పంటించే ప్రయత్నం కూడా చేశారు. రమేష్ యాదవ్‌కు గాయాలుకాగా, తీవ్ర గాయాలతో రక్తం ఓడుతున్న వేల్పుల రామలింగారెడ్డిని ఆస్పత్రిలో చేర్పించారు. లా అండ్ ఆర్డర్ కాపాడాల్సిన పోలీసులు పూర్తిగా ప్రేక్షక పాత్ర వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులెవ్వరినీ పల్లెల్లో తిరగనీయకూడదని, ఒకవేళ అలా చేస్తే ఈ రకంగా దాడులు చేస్తామన్న సంకేతాలు ఇవ్వడానికే టీడీపీ గ్యాంగులతో ఈ దారుణాలకు ఒడిగట్టారు. తప్పు చేసిన వారిని అరెస్టులు చేయాల్సింది పోయి, ఆగస్టు 6వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు వైఎస్సార్‌సీపీ



నాయకులపైనే తప్పుడు కేసు పెట్టారు. ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వేల్పుల రామలింగారెడ్డిపై దాడి చేసిన వారిలో ఒక్కరిని కూడా పోలీసులు అరెస్టు చేయకపోగా, జరగని ఘటనను జరిగినట్టుగా ఒక తప్పుడు ఫిర్యాదును సృష్టించి, దాని ఆధారంగా బాధితుడైన వేల్పుల రాము సహా మరో 50 మందిని నిందితులుగా పేర్కొంటూ ఎస్సీ, ఎస్టీ, హత్యాయత్నం కేసు పెట్టారు. ఈ తప్పుడు కేసును వాడుకుని, ఇప్పటికే పలు అరెస్టులు చేశారు. పోలింగ్ రోజున మరింత మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను నిర్బంధించే కుట్రను అమలు చేస్తున్నారు. ఆగస్టు 8న వైఎస్సార్‌సీపీకి చెందిన ఒక నాయకుడిని బెదిరించి, భయపెట్టి, ప్రలోభపెట్టి, తమ వైపునకు లాక్కుని, అలా పార్టీ మారిన వ్యక్తి నుంచి తప్పుడు ఫిర్యాదు తీసుకుని.. తప్పుడు కేసుపెట్టి, దాని ఆధారంగా వైఎస్సార్‌సీపీకి చెందిన రాఘవరెడ్డి, గంగాధరరెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకరరెడ్డిలకు నోటీసులు జారీ చేశారు. అధికార పార్టీతో చేతులు కలిపిన అధికారులు.. ఆగస్టు 8న వైఎస్సార్‌సీపీ ఓట్లను తగ్గించేందుకు పల్లెల పోలింగ్ బూత్‌లను ఆ గ్రామాల్లో కాకుండా పక్క గ్రామాలకు మార్చారు. ఓటు వేయాలంటే రెండు గ్రామాల ప్రజలు 2 కి.మీ, మరో రెండు గ్రామాల ప్రజలు 4 కి.మీ దూరం వెళ్లాల్సి ఉంటుంది. పులివెందుల జెడ్పీటీసీలో 10,601 ఓట్లు ఉంటే అందులో దాదాపు 4 వేల మంది ఓటర్లను, పక్కా వైఎస్సార్‌సీపీకి చెందిన గ్రామాలకు చెందిన వారిని ఈ రకంగా ఇబ్బంది పెడుతున్నారు. వీళ్లు ఓటేయడానికి వెళ్లకుండా బెదిరించడం, భయపెట్టడం, భౌతిక దాడులకు దిగడం, ఓటు వేయనీయకుండా అడ్డుకుని, తద్వారా ఓటింగ్‌ను తగ్గించడం, బూత్‌లను ఆక్రమించుకుని రిగ్గింగ్‌కు పాల్పడటం.. ఈ మాదిరి చంద్రబాబు కుట్ర చేస్తున్నారు. (పోలింగ్ బూత్‌లను అడ్డగోలుగా ఎలా మార్చారన్నది టేబుల్‌లో పరిశీలించగలరు.) నల్లగొండువారిపల్లి వద్ద టీడీపీ గ్యాంగుల దాడిలో గాయపడ్డ వేల్పుల రామలింగారెడ్డిపైనే ఆగస్టు 8వ తేదీ రాత్రి ఎస్సీ, ఎస్టీ తప్పుడు కేసు పెట్టిన ఘటనలో 12 మందిని అరెస్టు చేశారు. ఇందులో కొంత మంది, ఆ ఘటన జరిగినట్టుగా పోలీసులు చెబుతున్న సమయంలో బైండోవర్ ప్రక్రియలో భాగంగా అదే పోలీస్

### స్టేషన్లో, పోలీసుల సమక్షంలోనే ఉన్నారు.

అయినా వారి మీద కూడా ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టారు. సాక్ష్యాలు, రుజువులు చూపించడంతో తప్పని పరిస్థితుల్లో పోలీసులు వీరిని వదిలి పెట్టాల్సి వచ్చింది. మిగిలిన 8 మందిని ఈ తప్పుడు కేసులో రిమాండ్‌కు తరలించారు. ఈ తప్పుడు కేసులోనే టీడీపీ వాళ్లు ఎవరు కోరితే వారిని నిర్బంధించే పనిలో పోలీసులు ఉన్నారు. విచిత్రం ఏంటంటే, టీడీపీ కండువా కప్పుకోగానే ఒకర్ని ఈ కేసులో నిందితుల జాబితా నుంచి తప్పించారు. ఎన్నికల పోలింగ్ రోజున ఓటింగ్ శాతం తగ్గించేందుకు, తాము చేసే దాడులు, దౌర్జన్యాలు, బూత్ ఆక్రమణలు, రిగ్గింగ్‌లు కనిపించకుండా ఉండేందుకు, అక్కడ వాస్తవాలేమీ బయటకు తెలియనీయకుండా ఉండేందుకు మీడియాను కట్టడి చేస్తున్నారు. వారిపైనా దాడులకు సిద్ధమవుతున్నారు. లైవ్ వాహనాలను, వాటికి సంబంధించిన కిట్లను ధ్వంసం చేయడానికి టీడీపీ గ్యాంగులు ఇప్పటికే తిరుగుతున్నాయి. అసలు ఇవి ప్రజాస్వామ్య ఎన్నికలు అని చెప్పుకునేందుకు సిగ్గుపడాలి. అయినా దేవుడి మీద, ప్రజల మీద నమ్మకం ఉంది. అంతిమంగా ధర్మమే గెలుస్తుంది.

# ప్రధాని మోదీని కలిసిన తెదేపా ఎంపీలు

ఢిల్లీ: లోక్‌సభ, రాజ్యసభలు సోమవారం ఉదయం వాయిదా పడిన అనంతరం కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఇతర ఎంపీలు పీఎం ఛాంబర్‌కు వెళ్లి ప్రధాని మోదీని కలిశారు. ఈ సందర్భంగా మోదీ విశాఖలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమానికి హాజరవడంతో అది విజయవంతమైందని గుర్తుచేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రాష్ట్రానికి కేంద్రం అందిస్తున్న సహకారాన్ని కొనసాగించాలని, మరింత సహకారాన్ని అందివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం చేసినందుకు ఎంపీలు అభినందనలు తెలిపారు. ట్రంప్ సుంకాల వల్ల రాష్ట్రంపై పడుతున్న తీవ్ర ప్రభావాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంలో అగ్రరాజ్యంతో కేంద్రం చేస్తున్న పోరుకు అండగా ఉంటామన్నారు. రాష్ట్రం నుంచి ఎక్కువగా ఎగుమతి అయ్యే ఆక్వా, మత్స్య ఉత్పత్తులు, మిర్చి, ఇతర ఆహార ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపుతాయని వివరించారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వంతో పాటు తాము ప్రత్యామ్నాయ మార్గాలపైనా దృష్టిసారించామని చెప్పారు. పలు మంత్రిత్వశాఖల సంయుక్త కార్యదర్శులతో చేపట్టిన కార్యక్రమాలు, వాటి ఫలితాలు, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించి ఎంపీలంతా ఒక్కో నియోజకవర్గంలో ఎలా విజయవంతం చేశారో తెలియజేసే పుస్తకాలను తెదేపా ఎంపీ లావు కృష్ణదేవరాయులు ప్రధానికి అందించారు. అనంతరం కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు విజయనగరం ఎంపీ అప్పలనాయుడిని ప్రధాని మోదీకి పరిచయం చేశారు. అప్పలనాయుడు కొత్తకొత్త విషయాలను అన్వేషిస్తారని, మంచి ఆసక్తి గల వ్యక్తి అని మోదీ కితాబిచ్చారు.

# ఏపీ మద్యం కుంభకోణం.. అదనపు ఛార్జ్‌షీట్ దాఖలు చేసిన సిట్

విజయవాడ: ఏపీ మద్యం కుంభకోణం కేసులో సిట్ అదనపు ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. 200 పేజీలతో కూడిన ఛార్జ్‌షీట్‌ను విజయవాడలోని ఏసీబీ కోర్టుకు సిట్ అధికారులు సమర్పించారు. నిందితులు ధనుంజయరెడ్డి (ఏ 31), కృష్ణమోహన్‌రెడ్డి (ఏ 32), గోవిందప్ప బాలాజీ (ఏ 33) ప్రమేయం, నగదు తరలింపు అంశాలను దీనిలో సిట్ పేర్కొన్నట్లు సమాచారం. ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డితో వీరికి గల సంబంధాలు, నగదును అంతిమ లబ్ధిదారుకు చేర్చిన విధానాన్ని ఛార్జ్‌షీట్‌లో సిట్ ప్రస్తావించినట్లు తెలుస్తోంది. మద్యం కుంభకోణం కేసులో గత నెల 19న సిట్ అధికారులు ప్రాథమిక ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేశారు. అందులో ఉన్న 9 సంస్థలు, ఏడుగురు వ్యక్తులపై అభియోగాలు మోపింది. ఇప్పుడు దానికి అనుబంధంగా మరో ఛార్జ్‌షీట్‌ను సిట్ దాఖలు చేసింది. ఈ కేసులో ఇప్పటివరకు 19 సంస్థలు, 29 మంది వ్యక్తులు నిందితులుగా ఉన్నారు. రాజ్ కెసిరెడ్డి (ఏ1), బూనేటి చాణక్య (ఏ-8), పైలా దిలీప్ (ఏ-30), సజ్జల శ్రీధర్‌రెడ్డి (ఏ-6), కె.ధనుంజయరెడ్డి (ఏ-31), పి.కృష్ణమోహన్‌రెడ్డి (ఏ-32), గోవిందప్ప బాలాజీ (ఏ-33), సీహెచ్.వెంకటేశ్‌నాయుడు (ఏ-34), చెవిరెడ్డి భాస్కరరెడ్డి (ఏ-38), పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి (ఏ-4), బాలాజీ కుమార్ యాదవ్ (ఏ-35), ఈ.నవీన్ కృష్ణ (ఏ-36) సహా మొత్తం 12 మంది అరెస్టయ్యారు. కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది. అది పూర్తయ్యాక ఇంకో అనుబంధ ఛార్జ్‌షీట్‌ను సిట్ అధికారులు దాఖలు చేయనున్నారు.

## ఏపీలో ఉచిత బస్సు పథకం.. మార్గదర్శకాలు విడుదల

అమరావతి: ఏపీ వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. 'స్త్రీ శక్తి' పేరిట ఈ నెల 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. 5 కేటగిరీ బస్సుల్లో ఈ సౌకర్యాన్ని అందించబోతున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. పల్లె వెలుగు, ఆల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. బాలికలు, మహిళలు, ట్రాన్స్ జెండర్లు తగిన గుర్తింపు కార్డు చూపించి ఉచిత ప్రయాణం చేయొచ్చు. తిరుమల-తిరుపతి మధ్య తిరిగే సప్తగిరి బస్సుల్లో ఉచిత ప్రయాణం వర్తించదు. నాన్ స్టాప్, ఇతర రాష్ట్రాల మధ్య తిరిగే అంతర్రాష్ట్ర బస్సు సర్వీసుల్లో ఉచిత ప్రయాణం వర్తించదు. సప్తగిరి ఎక్స్ ప్రెస్, ఆల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ, స్టార్ లైనర్, ఏసీ బస్సులకు పథకం వర్తించదు. బస్సుల్లో రద్దీ పెరగనున్న దృష్ట్యా అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. అన్ని బస్సుల్లో సీసీ కెమెరాలు, కండక్టర్లకు బాడీ ఓర్న్ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. బస్టాండ్లలో మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఎండీని ఆదేశిస్తూ.. రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే ఉత్తర్వులు జారీ చేశారు.

### వాతావరణ శాఖ హెచ్చరికలపై
# హోం మంత్రి అనిత సమీక్ష

అమరావతి: వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో హోం మంత్రి అనిత జిల్లాల కలెక్టర్లు, విపత్తు నిర్వహణశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. అన్ని ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కువగా నష్టం జరగనున్న ప్రాంతాలను ముందే గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ముఖ్యంగా ప్రమాద హాట్‌స్పాట్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. తాజా పరిస్థితులపై తనకు ఎప్పటికప్పుడు నివేదించాలని అధికారులను మంత్రి కోరారు.

## ఆరు గ్యారంటీల కాంగ్రెస్ హామీ.. ఆర్థిక రంగానికి నష్టం చేసింది: కేటీఆర్

హైదరాబాద్: కాగ్ త్రైమాసిక నివేదిక ప్రకారం రాష్ట్ర ఆదాయం బాగా తగ్గిందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. రాష్ట్ర ఆదాయం తగ్గడం.. ప్రమాద ఘంటికలను మోగిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతో ఆర్థిక రంగం దెబ్బతింటోందని విమర్శించారు. ఆరు గ్యారంటీల కాంగ్రెస్ హామీ.. ఆర్థిక రంగానికి నష్టం చేసిందని ఎద్దేవా చేశారు. "రాష్ట్ర ఆదాయం తగ్గుతుంటే.. అప్పులు మాత్రం పెరుగుతున్నాయి. రూ.2,738 కోట్ల మిగులు ఉంటుందని బడ్జెట్లో చూపారు. మొదటి త్రైమాసికానికే రూ.10,583 కోట్ల రెవెన్యూ లోటు వచ్చింది. మూడు నెలల్లోనే రూ.20,266 కోట్లు అప్పుగా తీసుకున్నారు. ఒక్క రోడ్డు వేయలేదు.. ఒక్క కొత్త ప్రాజెక్టు కట్టలేదు. ఆర్థిక రంగాన్ని ఎలా గాడిన పెడతారో కాంగ్రెస్ ఆర్థిక నిపుణులు చెప్పగలరా?" అని కేటీఆర్ ప్రశ్నించారు.

### హైడ్రాలో ఆగిపోయిన ఎమర్జెన్సీ సేవలు..
# స్పందించిన కమిషనర్ రంగనాథ్



హైదరాబాద్: హైడ్రా కంట్రోల్ రూమ్ సేవలు బంద్ అయ్యాయన్న కథనాలపై కమిషనర్ రంగనాథ్ స్పందించారు. హైడ్రా విధులు ఎక్కడా ఆగలేదని.. ప్రజా వాణి యధాతథంగా కొనసాగుతోందని సోమవారం మధ్యాహ్నం స్పష్టం చేశారాయన. ఈ ఉదయం.. జీతాలు తగ్గించడంతో మార్షల్స్ విధులు బహిష్కరించారన్నది తెలిసిందే. ఆపై బైక్ ర్యాలీ చేపట్టారు. దీంతో గ్రేటర్ హైదరాబాద్‌లోని 150 డివిజన్లలో వీళ్లు అందించే ఎమర్జెన్సీ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇది ఇలాగే కొనసాగితే హైడ్రా వర్షాకాల సేవలపై ప్రభావం పడుతుందని అంతా భావించారు. ఈలోపు.. సేవలేం ఆగిపోలేదని హైడ్రా ప్రకటించడం గమనార్హం.

హైదరాబాద్ నగరంలో వర్షాకాలం నేపథ్యంలో హైడ్రా యంత్రాంగం మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌లు రంగంలోకి దిగి సేవలు ప్రారంభించింది. ఈ సేవల్లో మార్షల్స్, డిఆర్ఎఫ్ బృందాలు, ట్రాఫిక్ సపోర్ట్ టీమ్‌లు, క్లీన్-అప్ సిబ్బంది భాగంగా ఉన్నారు. మొత్తం 150 డివిజన్‌లలో మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌లు: ఒక్కో టీమ్‌లో 4 మంది, మూడు షిఫ్టుల్లో పనిచేస్తున్నారు. ఇందులో డీఆర్ఎఫ్ బృందాలు 51 టీమ్‌లు ఉండగా.. మొత్తం 918 మంది సిబ్బంది ఉన్నారు. అలాగే.. స్టాటిక్ బృందాలు 368 ఉండగా.. నీటి నిలయాల వద్ద 734 మంది ఉన్నారు. 21 బైకులతో ఎమర్జెన్సీ బైక్ బృందాలను ఏర్పాటు చేశారు. ఇక ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల భద్రత, సమన్వయం కోసం మార్షల్స్‌ను ఏర్పాటు చేశారు. వీళ్లలో మాజీ సైనికులే ఎక్కువగా ఉన్నారు. మొత్తంగా.. మాన్‌పవర్ 4,100 మంది ఉన్నారు. వానా కాలంలో నీరు తొలగించేందుకు పంపులు, చెట్ల కట్ మిషిన్లు, క్లీన్-అప్ టూల్స్ వీళ్లకు అందిస్తున్నారు. ప్రతి బృందానికి ఒక్కరోజులోనే సత్వర శిక్షణ ఇప్పించారు. హైడ్రా, జీహెచ్ఎంసీ సమన్వయంతో ఈ సిబ్బంది సేవలు అందిస్తూ వస్తున్నారు.

# నిరుపేదలకు ఇళ్ల పట్టాలి ఇవ్వండి

## ఐ ఎఫ్ టు యు జిల్లా ప్రధాన కార్యదర్శి బి సురేష్




గుంతకల్లు ప్రతినిధి – పల్లె రామాంజనేయులు ఆగస్టు 12 (శుభోదయం న్యూస్) : అర్హులైన నిరుపేదలకు ఇళ్ల పట్టాలి ఇవ్వాలని ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి సురేష్ డిమాండ్ చేశారు సోమవారంఐఎఫ్టియు )ఆధ్వర్యంలో అర్హులైన నిరుపేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సంగమేష్ సర్కిల్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగి అక్కడ ధర్నా ను నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమం ఉద్దేశించి ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి , సురేష్ ,



రాయలసీమ విద్యావంతుల వేదిక కార్యదర్శి వెంకటేష్ , బిసి యువసేన రాష్ట్ర నాయకులు చంద్ర చర్లహరి మాట్లాడుతూ అనంతపురం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వలస వచ్చి వివిధ వార్డుల్లో , శివారు ప్రాంతాలలో అనేకమంది పేదలు నివసించుచు చిన్నచిన్న కూలి పనులు చేసుకొని బతుకుతున్నారు . మీరందరూ అనేక సంవత్సరాలుగా సొంత గృహాలు లేకుండా బాడుగ ఇళ్లల్లో నివసించు ఉండడంతో వారు సంపాదించిన డబ్బుల్లో ఎక్కువ భాగం ఇంటి అద్దెలు చెల్లించడానికి ఖర్చు అవుతుండడం , మిగిలిన సంపాదనలో పిల్లల చదువులకు , అనారోగ్యాలకు ఖర్చు అవుతుండడంతో అనేకమంది అప్పులు పాలై దుర్భరమైన జీవితాలను గడుపుతున్నారు . వీరందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని గతంలో తాహసిల్దార్, ఆర్డీవో గారికి వినతి పత్రాలను, వారికి సంబంధించిన లిస్టును అందజేయడం జరిగినది. అయినా ఇప్పటివరకు వారందరికీ ఇళ్లపట్టాలు ఇవ్వడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేయడం జరుగుతున్నది . కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్లు , గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు అర్హులైన నిరుపేదలకు అందరికీ తాము అధికారంలోకి వస్తానే ఇళ్లపట్టాలు ఇచ్చి , పక్కా గృహాలు నిర్మిస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు అమలు పరచలేదు . అనంతపురం నగరంలో ఇప్పటికే అర్హులైన వారు పదివేల మంది ఉన్నారని ప్రభుత్వ రికార్డులు తెలుపుతున్నాయి . వీరందరికీ ప్రభుత్వం వెంటనే ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేయడం జరిగినది . కూటమి ప్రభుత్వం కార్పోరేట్ కంపెనీలకు ఒక్క రూపాయికే స్థలాలను కేటాయించడం , లూలు షాపింగ్ మాల్ లకు ప్రభుత్వ స్థలాలను ఇవ్వడం, ప్రతి నియోజకవర్గంలో భూ బ్యాంక్ పేరుతో 50 వేల ఎకరాలను ప్రభుత్వ భూములను సేకరించడం జరుగుతున్నది . వీటిని సోలార్ కంపెనీకి , మరికొన్ని కంపెనీలకు తక్కువ ధరలకే భూములు ఇవ్వడం జరుగుతున్నది . ఈ విధంగా కూటమి ప్రభుత్వం పేదల ఓట్లతో ఎన్నికలలో గెలిచి అధికారంలోనికి వచ్చి అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వం దగ్గర స్థలం లేదని చెప్పడం దుర్మార్గం ప్రభుత్వ వైఖరిని ప్రజలందరూ పూర్తిగా వ్యతిరేకించడం జరుగుతున్నది . మరియు ఐ ఎఫ్ టి యు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, ఐ ఎఫ్ టి యు నగర అధ్యక్షులు దావీద్ , పిడిఎస్యు నగర కార్యదర్శి శంకర్ , జిల్లా కమిటీ సభ్యులు రఘునాథరెడ్డి , రాందాస్, నాగరాజు తదితరులు మాట్లాడడం జరిగినది .ధర్నా కార్యక్రమం తర్వాత పది మందితో జిల్లా జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ గారికి గ్రీవెన్స్ లో మెమోరాండం ను ఇవ్వడం జరిగినది. ఐఎఫ్టియు కమిటీ సభ్యులు నరసప్ప లక్ష్మీనారాయణ నాగభూషణం నాగరత్న, సరోజమ్మ, జిలాన్ షేక్షావలి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొనడం జరిగినది.

## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని మంత్రి ఫరూఖ్ కు

## వినతి పత్రం అందజేసిన ఇండియన్ రిపోర్టర్ అసోసియేషన్....



నంద్యాల రిపోర్టర్ / మోహన్ (శుభోదయం న్యూస్ ): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టు సోదరులందరికీ కొత్త అక్రిడేషన్ కార్డులతో పాటు,ఇళ్ల స్థలాలు కూడా ఇవ్వాలని ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జయప్రకాష్ నారాయణ మంత్రి ఫరూఖ్ ను కోరారు.కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిన కూడా అర్హులైన పాత్రికేయులకు నేటికీ క్రొత్త అక్రిడేషన్ లు ఇవ్వలేదని,ప్రభుత్వం మూడు మాసాలకు ఒకసారి పొడిగిస్తూ వస్తుందని,ఈసారి పొడిగించకుండా క్రొత్త అక్రిడేషన్ కార్డులను ఇవ్వాలని ఐరా రాష్ట్ర అధ్యక్షులు జయ ప్రకాశ్ నారాయణ మంత్రికి విన్నవించారు.గత ప్రభుత్వం వల్ల ఎంతో మంది అర్హులైన పాత్రికేయులు అక్రిడేషన్ సౌకర్యం కోల్పోయారని,కూటమి ప్రభుత్వం రాకతో అందరికీ కొత్త అక్రిడేషన్ లు వచ్చేలా చూడాలని వారు మంత్రిని కోరారు.అలాగే జర్నలిస్ట్ లకు యాక్సిడెంటల్ ఇన్స్యూరెన్స్ పథకాన్ని తిరిగి పునరుద్ధరించాలని,అంతే కాకుండా ముఖ్యంగా రాష్ట్రంలోని పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు అందని ద్రాక్షగా మారాయని అన్నారు.ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా తక్షణమే ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు,ఇంటి నిర్మాణానికి సహకరించాలని మంత్రిని కోరారు.అంతే కాకుండా దీర్ఘకాలికంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.50 సంవత్సరాలు నిండిన ప్రతి పాత్రికేయునికి పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలన్నీ కూడా జర్నలిస్టులు అందరికీ అదే విధంగా ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు.రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టు పిల్లలందరికీ ప్రైవేట్ మరియు కార్పొరేట్ పాఠశాలల్లో 50% ఫీజు రాయితీ కల్పించేలా ప్రభుత్వం ప్రత్యేక జీ.ఓ ను విడుదల చేయించాలని విన్నవించారు.జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.అక్రిడేషన్ కమిటీలో అన్ని యూనియన్ల ప్రాధాన్యత కల్పించే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు.జర్నలిస్టులందరికీ ప్రభుత్వమే ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇచ్చి,ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు.నంద్యాల పట్టణంలో ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేయుటకు 20 సెంట్ల స్థలాన్ని కేటాయించి నూతనంగా ప్రెస్ క్లబ్ నిర్మించాలని మంత్రిని కోరడం జరిగిందని అన్నారు.న్యాయ శాఖ మంత్రి ఫరూఖ్ పాత్రికేయుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందిస్తూ జర్నలిస్ట్ ల పిల్లలకు ప్రైవేట్,కార్పొరేట్ లో 50% రాయితీ కలెక్టర్ తో మాట్లాడి నంద్యాల జిల్లాలో ఉన్న పాత్రికేయుల పిల్లలకు రాయితీ కల్పించే విధంగా చూస్తానని అన్నారు. అలాగే త్వరితగతిన పాత్రికేయులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రిపోర్టర్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి జాషువా బాబు,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శరత్ బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్ బాబు,సభ్యులు విజయానంద్,రాజ్ కుమార్,రావూఫ్,మోహన్, విజయ్,తులసిరామ్ తదితరులు పాల్గొన్నారు.

## హై స్కూల్ విద్యార్థులచే హర్ ఘర్ తిరంగా ర్యాలీ



పిడుగురాళ్ల, టౌన్ రిపోర్టర్ – శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్): పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ హై స్కూల్ నుండి సోమవారం సాయంత్రం "హర్ ఘర్ తిరంగ" ర్యాలీ ఘనంగా నిర్వహించారు.

## ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నీ మర్యాదపూర్వకంగా కలిసిన బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్



(శుభోదయం న్యూస్) బాపట్ల జిల్లా: పార్లమెంట్ ప్రాంగణంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ తో సహచర టీడీపీ ఎంపీలతో కలిసి సమావేశమైన, బాపట్ల పార్లమెంట్ సభ్యులు లోకసభ ప్యానల్ స్పీకర్ తెన్నేటి కృష్ణ ప్రసాద్, ఏపీ అభివృద్ధికి సహకరించవలసినదిగా కోరటం జరిగింది. ఆంధ్రప్రదేశ్ కొద్ది కాలంలోనే ప్రగతి బాట పట్టింది – ఏపీ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది – ఏపీ అభివృద్ధికి ఎప్పుడూ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ప్రధానమంత్రి హామీ ఇవ్వడం జరిగింది.

## డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో బటన్ హోల్ ఆపరేషన్ సౌకర్యం కల్పించాలి : ఏఐవైఎఫ్



నంద్యాల, శుభోదయం ప్రతినిధి– సుధాకర్ (శుభోదయం న్యూస్): డోన్ పట్టణంలో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి లో బటన్ హోల్ ఆపరేషన్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వ ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ హనీఫ్ కి ఏఐవైఎఫ్ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా అఖిల భారత యువజన సమాఖ్య నంద్యాల జిల్లా అధ్యక్షుడు రణత్ యాదవ్, ఏఐవైఎఫ్ డోన్ మండల కార్యదర్శి జి పృథ్వీ కుమార్, మండల అధ్యక్షులు హరి, ఏఐటీయూసీ. నియోజవర్గ కార్యదర్శి అబ్బాస్, ఏఐవైఎఫ్ మండల సహాయ కార్యదర్శి నాగరాజులు మాట్లాడుతూ డోన్ పట్టణంలో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి కి డోన్ నియోజకవర్గంలో ఉన్న డోన్, బేతంచేర్ల, ప్యాపిలి మండలాల మహిళలే కాక పక్క మండలాల్లోని మహిళలు కూడా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ కోసం వస్తుంటారు.కానీ డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ కోత ఆపరేషన్ మాత్రమే చేస్తూ కొన్ని కొన్ని సమస్యల కారణంగా బటన్ హోల్ ఆపరేషన్ సౌకర్యం లేనందువలన ప్రైవేట్ ఆసుపత్రిలో చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రైవేట్ హాస్పిటల్లో చేయించుకోవాలంటే సామాన్య పేద ప్రజలకు దాదాపు 25000వేల రూపాయల నుంచి 30000వేల రూపాయలు ఖర్చు వస్తుంది. కాబట్టి సామాన్య ప్రజలకు ఇది చాలా ఆర్థిక భారం అని వారు అన్నారు. కాబట్టి డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో తక్షణమే బటన్ హోల్ ఆపరేషన్ సౌకర్యం కల్పించాలని, అదేవిధంగా ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేసి ట్రామాకేర్ సెంటర్, ఐసీయు ఏర్పాటు చేసి సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వారు అన్నారు .

## మెడ బలిమి, పెనుమాల వారి వివాహ వేడుకల్లో పాల్గొన్న.... ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర, కోటపాటి, ఇరిగినేని, దారపనేని, బైరెడ్డి, గుర్రం



పామూరు, మండల రిపోర్టర్ – బండి రమేష్ (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం మోట్రావులపాడు గ్రామ వాస్తవ్యులు మెడ బలిమి ముసలయ్య శ్రీమతి నాగార్జున మ్మ దంపతుల కనిష్ట పుత్రిక జయశ్రీ, మోట్రావులపాడు గ్రామ వాస్తవ్యులు పెనుమాల గురవయ్య, శ్రీమతి రాములమ్మ దంపతుల కుమారుడు చిరంజీవి లక్ష్మీనారాయణ ల వివాహ వేడుకలు ఆదివారం రాత్రి మోట్రావులపాడు గ్రామంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకల్లో కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, టిడిపి నాయకులు ఇరిగినేని రవీంద్రబాబు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దన్ రావు, కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి, పామూరు టిడిపి మండల పార్టీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు,మోపాడు టిడిపి నాయకులు గుర్రం వెంకటేశ్వర్లు పాల్గొని వధూవరులను అక్షింతలతో ఆశీర్వదించారు. వివాహ వేడుకల్లో పాలపర్తి వెంకటేశ్వర్లు, పామూరు పట్టణ యూనిట్ ఇంచార్జ్ షేక్ గౌస్ బాషా, మాజీ జెడ్పిటిసి మెడబలిమి గురువయ్య, మెడబలిమి వెంకట్రావు, పామూరు పట్టణ టిడిపి మాజీ అధ్యక్షులు షేక్ ఖాజా రహమతుల్లా, తడిక మల్ల సుబ్బారావు, కౌలూరి ఖాజా రహమతుల్లా, మెడబలిమి వారి కుటుంబ సభ్యులు, పెనుమాల వారి కుటుంబ సభ్యులు బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు భారీ సంఖ్యలో పాల్గొని వధూవరులను అక్షింతలతో ఆశీర్వదించారు.

## ఎస్సీ సెల్ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలి

### మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు



పామూరు, మండల రిపోర్టర్ – బండి రమేష్ (శుభోదయం న్యూస్): ఈనెల 13వ తేదీన విశాఖపట్నంలో జరిగే వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా స్థాయి విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని వైఎస్ఆర్సిపి పార్లమెంట్ పరిశీలకులు మాజీ ఎమ్యెల్యే కదిరి బాబురావు అన్నారు. విశాఖపట్నం వైసీపి జిల్లా పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్లు,వైసీపీ ముఖ్య నాయకులతో సోమవారం కదిరి బాబురావు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కదిరి బాబురావు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో జరిగే వైసీపీ ఎస్సీ సెల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు టిజే సుధాకర బాబు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో వైసీపీ ఎస్సీ సెల్ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశ నిర్దేశం చేయడం జరుగుతుందని అన్నారు. కావున ఈ సమావేశాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా నలుమూలల నుండి ఎస్సీ సెల్ నాయకులు ,కార్యకర్తలు అధిక సంఖ్యలో వచ్చేలా చూడాలని నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైసీపి జిల్లా పార్టీ అధ్యక్షులు కేకే రాజు ,ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## కనిగిరి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గా యారవ రమ శ్రీనివాసులు, పిడుగు శ్రీనివాసులు ఆధ్వర్యంలో కేక్ కటింగ్



పామూరు, మండల రిపోర్టర్ – బండి రమేష్ (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గాయారవ రమ శ్రీనివాసులు ని నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సోమవారం జీవోని ప్రకటించింది అనంతరం స్థానిక మమ్మీ డాడీ సెంటర్లో పిడుగు శ్రీనివాసులు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా స్థానిక మమ్మీ డాడీ సెంటర్లో టపాకాయలు పేలుస్తూ నినాదాలు చేస్తూ కేక్ కటింగ్ చేసిన పిడుగు శ్రీనివాసులు మరియు వారి మిత్రబృందం పలువురు ప్రముఖులు యారవ రమా శ్రీనివాసులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ మాజీ అధ్యక్షులు కాజా రహమతుల్లా, ఆర్ఆర్ రఫీ, కావేరి రసూల్, వాయినేని రాఘవ,గుత్తి మహేష్, మరియు టిడిపి నాయకులు జనసేన నాయకులు పాల్గొన్నారు.

## కనిగిరి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గా ఎన్నికైన యారవ రమా శ్రీనివాసులకు శుభాకాంక్షలు తెలియజేసిన వాయినేని రాఘవ



పామూరు, మండల రిపోర్టర్ – బండి రమేష్ (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యారవ రమ శ్రీనివాసులు నియమిస్తూ సోమవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో విడుదలైన సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసిన పట్టణ టిడిపి నాయకులు వాయినేని రాఘవ. యారవ రమా శ్రీనివాసులు కనిగిరి నియోజకవర్గ ప్రజల మన్ననలను పొందుతూ ఇంకా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

## మహిళల పాలిట శాపంలా కూటమి ప్రభుత్వం - గంగసాని లక్ష్మి




పామూరు, మండల రిపోర్టర్ – బండి రమేష్ (శుభోదయం న్యూస్): రాష్ట్రంలో మహిళల పాలిట కూటమి ప్రభుత్వం శాపంలా మారిందని వైయస్సార్సీపీ రాష్ట్ర మహిళా విభాగం జోనల్ ప్రెసిడెంట్స్, పామూరు మండలం ఎంపీపీ గంగసాని లక్ష్మి మండిపడ్డారు.పామూరు స్థానిక పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ నిర్ణయాలు మహిళల జీవితాలను నాశనం చేసేలా ఉన్నాయని ధ్వజమెత్తారు..రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లాలన్న ఫ్రీ బస్సు అంటూ హామీ ఇచ్చిన చంద్రబాబు ఆ పథకానికి షరతులు విధించి మహిళలను మరోసారి మోసం చేస్తున్నారని ఆమె విమర్శించారు.ఉచిత బస్సు అమలు అయితే రాష్ట్ర వ్యాప్తంగా ప్రముఖ పుణ్యక్షేత్రాలు దర్శించుకోవచ్చని మహిళలు ఆశపడ్డారన్నారు.అయితే కూటమి ప్రభుత్వం ఏడాదిగా నాన్చుతూ వచ్చి ఎన్నో కొర్రిలు పెడుతూ ఆగస్టు 15 నుంచి అంటూ ప్రకటన ఇచ్చిందన్నారు.కొన్ని బస్సు సర్వీస్ లోనే మహిళలకు ఉచిత ప్రయాణమని ప్రకటించడంతో రాష్ట్రం లోని మహిళలు నిరాశకు గురయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో బడి, గుడి అన్న తేడా లేకుండా ఎక్కడపడితే అక్కడ మద్యం షాపులు ఏర్పాటు చేయడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గంగసాని లక్ష్మి ఆవేదన వ్యక్తం చేసారు. చాలా గ్రామాల్లో మద్యం బాటిళ్లను బెల్ట్ షాపుల్లో కాకుండా రోడ్డు ప్రక్కన విక్రయిస్తున్నారన్నారు.మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం తెచ్చిన మద్యం విధానం ద్వారా 2019-24 మధ్య మద్యం అమ్మకాలు గణనీయంగా తగ్గాయని రాష్ట్రంలో బెల్ట్ షాపులు లేకుండాచేసారని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. కానీ దీనికి పూర్తిగా భిన్నంగా కూటమి ప్రభుత్వంలో మద్యాన్ని ఎరులై పారిస్తున్నారన్నారు.మద్యం దుకాణం పక్కనే పర్మిట్ రూములు ఏర్పాటు చేస్తే మద్యపానానికి అడ్డాగా మారుతాయని, ఇప్పటికైనా ప్రభుత్వంతన నిర్ణయాలను మార్చుకోవాలని డిమాండ్ చేశారు..కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల తరుపున పోరాటం చేస్తామన్నారు.. ఈ మీడియా సమావేశం లో మహిళ జిల్లా కార్యదర్శి గాయకవాడ సుహాసిని పార్టీ పట్టణ అధ్యక్షురాలు ఓరుగంటి పద్మ,పందిటి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు..

## శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి పరివార దేవత ప్రతిష్టకు విరాళం ఇచ్చిన.... చింతలచెరువు సత్యనారాయణ రెడ్డి





పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): కనిగిరి మండలంలో లింగారెడ్డిపల్లి గ్రామం లో శివాలయం నిర్మాణానికి రూ 50,116/- విరాళంగా ఇచ్చిన కనిగిరి నియోజకవర్గ వైయస్సార్సీపి సీనియర్ నాయకులు చింతలచెరువు సత్యనారాయణ రెడ్డి ఈ కార్యక్రమంలో శీలం రామసత్యం చిలంకూరిబాలారెడ్డిచిలంకూరి లింగారెడ్డి చందా నరసారెడ్డి గంధం నరేంద్ర ముండ్ల మహేందర్ చిలంకూరి బాలకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి మహిళా నేతలకు ప్రశ్నల బాణం సంధించిన.. కనిగిరి నియోజకవర్గం ఐటిడిపి మహిళా నేతలు మద్దిశెట్టి రమాదేవి ఆవుల రవణమ్మ




పామూరు, మండల రిపోర్టర్ – బండి రమేష్ (శుభోదయం న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఉచిత ఆర్టీసీ ప్రయాణం పై, మరియు మద్యం పై వైసిపి మహిళా నేతలు పత్రికా సమావేశం నిర్వహించి ప్రభుత్వ విధానాలను విమర్శించడం శోచనీయంగా ఉందని కనిగిరి నియోజకవర్గం ఐటీడీపీ మహిళా నాయకురాలు మద్దిశెట్టి రమాదేవి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేవలం ఒక ఏడాది పాలనలోనే ఎంతో అభివృద్ధి చేస్తూ, ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వంపై అక్కసుతో చేసే ఆరోపణలు సరైనవి కావని అన్నారు. 3000 పెన్షన్ ని ఒకేసారి వెయ్యి రూపాయలు పెంచి 4000 చేయడం మహిళలని మోసం చేయడమా...? ఎంతమంది బిడ్డలు ఉన్న తల్లికి వందనం ఇవ్వడం మహిళల్ని మోసం చేయడమా...? అన్నదాత సుఖీభవ రైతులకు అందించడం రైతులను మోసం చేయడమా...? మహిళలకు ఈనెల 15వ తేదీ నుంచి ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించడం మహిళలను మోసం చేయడమా....? రాష్ట్రవ్యాప్తంగా రోడ్లను బాగు చేయడం రాష్ట్ర ప్రజలను మోసం చేయడమా....? అని ఆమె వైసిపి నేతలపై ప్రశ్నల బాణం సంధించారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని సంక్షేమాన్ని అభినందించాల్సింది పోయి ఇలా అవహేళనగా మాట్లాడడం మంచి పద్ధతి కాదని ఆమె హితవు పలికారు.ఈ సమావేశంలో కనిగిరి నియోజకవర్గం ఐటీడీపీ మహిళా నాయకురాలు మద్దిశెట్టి రమాదేవి తిరగల దిన్నె భూత్ ఇంచార్జి ఆవుల రవణమ్మ పట్టణ తెలుగు మహిళ అధ్యక్షురాలు జగదాభి రమణమ్మ తెలుగు మహిళా నాయకులు షేక్ షాహేరా సయ్యద్ రజియా పాల్గొన్నారు.

## హామీల అమలులో కూటమి ప్రభుత్వం వైఫల్యం - ఇంచార్జి దద్దాల



పామూరు, మండల రిపోర్టర్ : బండి రమేష్ (శుభోదయం న్యూస్): అధికారంలోకి వచ్చి 13 నెలలు కావస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందని , ఆశపూరితమైన హామీలతో ఎక్కువగా మహిళలను చంద్రబాబు ఘోరంగా మోసం చేశారని మనం తప్పకుండా రోజుల్లో కూటమి ప్రభుత్వానికి అక్క చెల్లెమ్మలు బుద్ధి చెప్పాలని వైయస్సార్సీపీ కనిగిరి నియోజకవర్గం ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ పేర్కొన్నారు. "బాబు ష్యూరిటీ –మోసం గ్యారంటీ " కార్యక్రమంలో భాగంగా మండల నాయకులు పిసి పల్లి మండలం అలవలపాడు పంచాయతీలోనీ వెంగలాపురం గ్రామం మరియు నేరేడుపల్లి పంచాయతీలో నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన స్థానిక పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ఇచ్చిన హామీలు,వాటిని అమలు చేయకుండా చేస్తున్న మోసం గురించి వివరించారు.ఒక్కో కుటుంబం చంద్రబాబు హామీలు అమలుకాకపోవడంతో ఎంత మేర నష్టపోయిందని క్యూఆర్ కోడ్ స్కాన్ చేయించి చూపించారు.ఈ సందర్భంగా ఇంచార్జి దద్దాల నారాయణ మాట్లాడుతూ గత వైయస్సార్సీపీ ప్రభుత్వంలో కులం, మతం,పార్టీ చూడకుండాఅర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించారని, నేడు అధికారంలో ఉన్నా కూటమి ప్రభుత్వం మాత్రం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని అన్నారు.ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న వైయస్సార్సీపీ నాయకులపై రెడ్ బుక్ పేరుతో వేదిస్తూ అక్రమ కేసులు బనాయించడం తప్పా ప్రజలకు చేసింది శూన్యమన్నారు.హామీలు ఎప్పుడూ అమలు చేస్తారంటూ కూటమి నేతలను ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు.ఇదే సమయంలో వైయస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో ఎంత మేర లబ్ది పొందారు,ప్రస్తుత కూటమి ప్రభుత్వం హయాంలో ఎంత నష్టపోయారో గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి లక్ష్మీకాంత ఓకే రెడ్డి మండల అధ్యక్షులు గోపవరపు బొర్రారెడ్డి, బత్తుల అంజయ్య,పాత కొట్టు పిచ్చిరెడ్డి, యట్టంరెడ్డి మోహన్ రెడ్డి, గుజ్జుల బాల సర్సారెడ్డి అలాగే బోడే కొండారెడ్డి,పెరికల వెంకటేశ్వర్లు,రేగుల బాలయ్య చౌదరి పరిమి వెంకటరావు చౌదరి, పొదిలి చెన్నకేశవులు ,ఉండేల వెంగలరెడ్డి మేకల మాల్యాద్రి యాదవ్ , పరుచూరి రమేష్ గౌడ్, మూలె రాజశేఖర్ రెడ్డి, శీలం సుదర్శన్, మూలే నారాయణరెడ్డి ,ఆవుల భాస్కర్ రెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణ రెడ్డి , కటికల వెంకటరత్నం ,వాకమల్ల రాజశేఖర్ రెడ్డి, నల్లగంగుల శ్రీనివాస్ యాదవ్, షేక్ నజీర్ భాష, రేకుల సుధాకర్ చౌదరి, వెన్నం దివ్య ,అత్యల ఇషాక్, గోడి నారాయణరెడ్డి, తోడేటి నాగేశ్వరరావు, సూరా మాల్యాద్రి రెడ్డి, మైల కొండయ్య, గుత్తికుంట నాగేశ్వర్రెడ్డి , ఆంధ్ర వెంకట్రావు, లింగాలదిన్నె నరసింహారెడ్డి , కొంధ్ర నరసింహ, ముప్పూరి వెంకటేశ్వర్లు, పోలక సుధాకర్ రెడ్డి, గాలి నాగేశ్వరరావు, అంధ్రా వీరాస్వామి, అంధ్ర నారాయణ, అంధ్ర పెద్ద బాలయ్య, పులి రవి , సంగటి కోటిరెడ్డి బోడే కోటిరెడ్డి, గణేష్ ని చెన్నకేశవులు, గుజ్జుల రమణారెడ్డి, బోడే మల్లికార్జున, బోడే శ్రీనివాసుల రెడ్డి, గుజ్జుల రాజమోహన్ రెడ్డి, బోరెడ్డి బాలకోటయ్య , సాము ప్రసాద్ రెడ్డి, గుర్రం నరసింహులు, చవడం శ్రీను, కొడవలూరి రవి, చీమలదిన్నె రవి, ఎలికే భాస్కర్ రావు, గోనుగుంట్ల సులోమాన్, గోనుగుంట్ల హేన్రి, ఉన్నం శ్రీను.

శుభోదయం
WWW.SUBHODAYAMDAILY.COM
ప్రతి అక్షరం..ప్రజా సమరం......!

జనరల్ న్యూస్

మంగళవారం - 12 - ఆగష్టు- 2025

## పేద కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన వైఎస్ఆర్సిపి నాయకులు షేక్ చాంద్ భాషా(బుజ్జి)



పామూరు, మండల రిపోర్టర్ - బండి రమేష్ (శుభోదయం న్యూస్): పామూరు పట్టణానికి చెందిన ముస్లిం యువకుడు సద్దాం పక్షవాతంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని వారి కుటుంబానికి అండగా నిలిచిన ముస్లిం మైనారిటీ నాయకులు, దానధర్మాల లో ముందుండే కనిగిరి మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ షేక్ చాంద్ బాషా (బుజ్జి భాయ్) బాధిత కుటుంబానికి పదివేల రూపాయలు ఆర్థిక సహకారం అందించి, బియ్యం నిత్యవసరాలు పంపుతామని హామీ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో సీనియర్ వైసీపీ నాయకులు, విశ్రాంత ఉపాధ్యాయులు, పామూరు మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నాయబ్ రసూల్, ఎంపీటీసీ అబ్దుల్, షేక్ కాలేషా, షేక్ ఖలీల్, ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

## కోటపాటి వారి వివాహ వేడుకల్లో పాల్గొన్న....
## ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర, కోటపాటి, ఇరిగినేని, దారపనేని, బైరెడ్డి, గుర్రం



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం బొట్లగూడూరు తెలుగుదేశం పార్టీ నాయకులు కోటపాటి నరసింహారావు శ్రీమతి వెంకట రమాదేవి దంపతుల జేష్ఠ పుత్రుడు చిరంజీవి లోకేష్, పీసీ పల్లి మండలం పిసి పల్లి గ్రామ వాస్తవ్యులు వీరపనేని చెన్నారావు, శ్రీమతి రమణమ్మ దంపతుల ఏకైక కుమార్తె అనూష వివాహ వేడుకలు పామూరు పట్టణంలోని పువ్వాడి కన్వెన్షన్ హాలులో ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకల్లో కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, టిడిపి నాయకులు ఇరిగినేని రవీంద్రబాబు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దన్ రావు, కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి, మోపాడు టిడిపి నాయకులు గుర్రం వెంకటేశ్వర్లు పాల్గొని వధూవరులను అక్షింతలతో ఆశీర్వదించారు. ఈ



వివాహ వేడుకల్లో అడుసుమల్లి నరసింహారావు, యోగానంద్, దేవరపు మాల్యాద్రి,మోపాడు రిజర్వాయర్ నీటి సంఘం చైర్మన్ చుంచు కొండయ్య, వైస్ చైర్మన్ మోరు బోయిన నరసింహారావు, బొట్లగూడూరు మాజీ సర్పంచులు మాలకొండ రాయుడు, విశాలమ్మ, మోపాడు టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు మోరుబోయిన గిద్దయ్య యాదవ్, డాక్టర్ కోటపాటి చంద్రశేఖర్ ,దారపనేని సుబ్బారావు, యరసింగు రాయుడు, డీఎంకే రాయుడు (చినరాయుడు) అనపర్తి వెంకటేశ్వర్లు, కమ్మ లక్ష్మయ్య చౌదరి, అనపర్తి శశి, రాయవరపు శ్రీకాంత్, పాలపర్తి వెంకటేశ్వర్లు, కోట చిన్న వెంకటేశ్వర్లు, కొలూరి ఖాజా రహమతుల్లా, తడికమల్ల సుబ్బారావు, కోటపాటి వారి బంధుమిత్రులు, వీరపనేని వారి బంధుమిత్రులు, దేవరపు వారి బంధుమిత్రులు, కమ్మవారి బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు భారీ సంఖ్యలో పాల్గొని వధూవరులను అక్షింతలతో ఆశీర్వదించారు.

## చలో ఢిల్లీని విజయవంతం చేయాలి

-పల్లగొర్లమోదీరాందేవ్



ఓబీసీ సమస్యల పైన ఆగస్టు 18 19 న జరగబోయే చలో ఢిల్లీకార్యక్రమాన్ని విజయవంతంచేయాలని భువనగిరి పట్టణ కేంద్రంలో విద్యార్థులతో కలిసి కరపత్రం ఆవిష్కరణ చేసి అభివాదం చేశారు.బిసి విద్యార్థి సంఘ రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్ మాట్లాడుతూ బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు రాజ్యసభ ఎం పి ఆర్ కృష్ణన్న ఆధ్వర్యంలో బీసీ సమస్యల పరిష్కారం కోసం జాతీయ సెమినార్,జంతర్ మంతర్ వద్ద ధర్నా కార్యక్రమానికి తరలిరావాలని అన్నారు,చట్టసభల్లో బీసీలకు 50 శాతంరిజర్వేషన్లుకల్పించాలని అలాగే ఎస్సీ ఎస్టీ బీసీ జనాభా దమాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని దేశవ్యాప్తంగా ఫీజు రీయింబర్స్మెంట్ అమలు చేయాలని కేంద్రంలో బీసీ ప్రత్యేక మంత్రుత్వ శాఖ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు హైకోర్టు న్యాయమూర్తులలో ఎస్సీ ఎస్టీ బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని రానున్న బడ్జెట్లో బీసీలకు రెండు లక్షల కోట్లు కేటాయించాలని అలాగే విద్యారంగానికి కూడా పెద్ద ఎత్తున నిధులుకేటాయించాలని దేశంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని,గవర్నమెంట్ సంస్థలో ప్రైవేటీకరణ నిషేధించాలని బీసీ క్రిమిలేయర్ ను ఎత్తివేయాలని ప్రమోషన్లలో రిజర్వేషన్లు వర్తింపజేయాలని బీసీలంట్లే కేవలం ఓట్లు వేసే యంత్రాలుగనే చూస్తున్నారు,ఉద్యోగాలలో బీసీలు 7 శాతం గిట్ల లేకపోవడం సిగ్గుచేటు రాజకీయంగా 12 శాతం దాటలేదు బీసీలు రాష్ట్ర ప్రభుత్వం ఏమో బీసీలకు స్థానిక సంస్థల 42 శాతం రిజర్వేషన్ అని చెప్పి దాన్ని అమలు చేయకుండా జాప్యం చేస్తున్నారు. బీసీలకు రానున్న ఎన్నికల్లో 42 శాతం జీవో తీసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి విద్యార్థులకు రావాల్సిన ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ విడుదల చేయాలని,సంక్షేమాష్టలకు సొంత భవనాలు నిర్మించాలనిమెస్చార్జులు 3,000లకు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం బీసీల కోసం ఢిల్లీలో సవతితల్లి ప్రేమతో ధర్నా చేస్తున్ననారు.బీసీ బిల్లుకు మద్దతు అని చెప్పి ఇంతవరకు దాని ఊసే లేదు స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ లేకుండా ఎన్నికల నిర్వహిస్తే రాష్ట్ర ప్రభుత్వాన్ని అగ్నిగుండం చేసుకొని హెచ్చరించారు.ఈ సమావేశంలో సంపత్, మంజుల,శిరీష గౌడ్, ఉమా రెడ్డి,స్నేహ, రమాదేవి,ఉదయ్ శ్రీ, మానస,ప్రత్యూష, విగ్నేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించిన నిషిధర్ రెడ్డి



రేగొండ మండల రిపోర్టర్ - మంతెన సురేష్ (శుభోదయం న్యూస్) : రేగొండ మండల కేంద్రానికి చెందిన పురుషోత్తం నారాయణ గారు అకాల మరణం చెందగా వారి పార్దివదేహానికి పూల మాల వేసి నివాళి అర్పించిన రేగొండ మాజీ సర్పంచ్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా బీజేపీ అధ్యక్షులు ఏడునూతుల నిషిధర్ రెడ్డి గారు వారు మాట్లాడుతూ రేగొండ మండలం లోని చుట్టు పక్కల గ్రామాలలో ప్రైవేట్ క్లినిక్ ద్వారా ప్రజలకు ప్రధమ చికిత్స చేసాడు తద్వారా చుట్టుపక్కల గ్రామాలకు ఆయన సుపరిచితుడు అని తన ఆత్మ ఎక్కడున్నా సంతోషంగా ఉండాలని వారి కుటుంబ సభ్యులను ఓదార్చడం జరుగుతుంది వారి వెంట మాజీ ఉపసర్పంచ్ గండి తిరుపతి గౌడ్ ఏనుగు రవిందర్ తూర్పటి మల్లేష్.ముష్క నరేందర్. పెండ్యాల రాజు. నేరెళ్ల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## శంకర్ పల్లి జన్వాడలో మంచు లక్ష్మి సేవలు

### విద్యార్థినులకు స్మార్ట్ క్లాసులు, ఆరోగ్య కిట్లు పంపిణీ



శంకర్ పల్లి, (శుభోదయం న్యూస్ ప్రతినిధి) - ప్రవీణ్ : చేవెళ్ల నియోజకవర్గం, శంకర్ పల్లి మండలం జన్వాడ ప్రభుత్వ పాఠశాలలో ఎమ్మెల్యే కాలే యాదయ్య, సినీ నటి మంచు లక్ష్మి (టీచ్ ఫర్ చేంజ్), రత్న రెడ్డి (వేని రావు ఫౌండేషన్) కలిసి బాలికలకు శానిటరీ ప్యాడ్స్, ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఒక డిజిటల్ స్మార్ట్ క్లాస్‌రూమ్‌ను ప్రారంభించారు. గతంలో 45 స్మార్ట్ క్లాస్‌రూమ్‌లను ఏర్పాటు చేసిన ఈ సంస్థలు, జన్వాడలో మరో 2 స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు ఏర్పాటు చేయనున్నాయి. ఈ డిజిటల్ తరగతులు విద్యను మరింత ఆసక్తికరంగా, అందుబాటులోకి తెస్తాయని ఎమ్మెల్యే యాదయ్య పేర్కొన్నారు.

## మరకత శివుడి సేవలో సైబరాబాద్ ఏసీపీ రవీందర్ రెడ్డి



శంకర్ పల్లి, శుభోదయం న్యూస్ ప్రతినిధి - ప్రవీణ్: శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామంలో వెలిసిన 11 వ శతాబ్దానికి చెందిన మహిమగల శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో శ్రావణమాసం మూడవ సోమవారం సైబరాబాద్ ఏసిపి రవీందర్ రెడ్డి దంపతులు పాల్గొని, స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారస్తులు పురం లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్ రెడ్డి, అన్నదాన కమిటీ చైర్మన్ దర్శన్ గౌడ్, కమిటీ సభ్యులు, అర్చకులు వీరేశం, ప్రమోద్ పాల్గొన్నారు.

## ఘనంగా పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



జిన్నారం : (శుభోదయం న్యూస్) : సంగారెడ్డి జిల్లా గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని మంత్రి కుంటలో గ్రామస్తుల ఆధ్వర్యంలో వేదమంత్రాల మంత్రోచ్చారణ మధ్య శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడింది. ఈ పవిత్ర వేడుకకు ముఖ్య అతిథులుగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి కోలన్ బాల్ రెడ్డి, వెంకటేశం గౌడ్, ప్రకాశం చారి తదితరులు హాజరై పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.దేవాలయ నిర్మాణానికి చిమ్ముల గోవర్ధన్ రెడ్డి 1,00,116 రూపాయల విరాళం అందజేస్తూ, గ్రామ అభివృద్ధి మరియు ఆధ్యాత్మిక కార్యక్రమాల ప్రోత్సాహానికి ఎల్లప్పుడూ తోడ్పాటును అందిస్తానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,దేవాలయాలు మన సంస్కృతి, సంప్రదాయాల ప్రతీకలు అని అన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ స్ పార్టీ మండల అధ్యక్షులు నాయికోటి రాజేష్, మాజీ సర్పంచ్లు సురేందర్ గౌడ్, జనార్ధన్, ఆంజనేయులు, నరేందర్, కదీర్,శ్రీనివాస్ రెడ్డి,బశెట్టి రాజు,శ్రీనివాస్ రెడ్డి, బి ఆర్ స్ పార్టీ నాయకులు పెంటేష్, మోహన్, శ్రీధర్ గౌడ్,నగేష్, భీమ్ రావు,శ్రీకాంత్ గౌడ్,గణేష్, రాజు గౌడ్,సాయి భరత్,శ్రీనివాస్ గౌడ్, మల్లేష్, శ్రీనివాస్, అనిల్, శేఖర్, అది ఆంజనేయులు,నిఖిల్ గౌడ్, గోపాల్, నర్సిములు మరియు గ్రామ పెద్దలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరైనారు.

## వావిలాలలో ఘనంగా బోనాలు పండుగ



జిన్నారం : (శుభోదయం న్యూస్) : వావిలాలలో నిర్వహించిన శ్రీ పోచమ్మ తల్లి, నల్ల పోచమ్మ తల్లి బోనాల పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. బోనాల పండుగకు ముఖ్య అతిథులుగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి కోలన్ బాల్ రెడ్డి, వెంకటేశం గౌడ్, ప్రకాశం చారి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధి, సంప్రదాయాల పరిరక్షణలో అందరూ కలసి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ స్ పార్టీ మండల అధ్యక్షులు నాయికోటి రాజేష్, మాజీ సర్పంచ్లు నవనీత్ రెడ్డి, రవీందర్, జనార్ధన్, ఆంజనేయులు, నరేందర్, కదీర్,శ్రీనివాస్ రెడ్డి,బశెట్టి రాజు,శ్రీనివాస్ రెడ్డి, బి ఆర్ స్ పార్టీ నాయకులు సంజీవరెడ్డి, రమేష్, గోపాల్, పెంటేష్, మోహన్, శ్రీధర్ గౌడ్,నగేష్, భీమ్ రావు,శ్రీకాంత్ గౌడ్,గణేష్, రాజు గౌడ్, బండి మహేందర్, ప్రభాకర్, శివశంకర్,సాయి భరత్,శ్రీనివాస్ గౌడ్, మల్లేష్, శ్రీనివాస్, అనిల్, శేఖర్,ఆంజనేయులు,నిఖిల్ గౌడ్, గోపాల్, నర్సిములు మరియు గ్రామ పెద్దలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరైనారు.

## గణేష్ గడ్డ దేవాలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే జిఎంఆర్



పటాన్చెరు : (శుభోదయం న్యూస్) : శ్రావణ మాసం పురస్కరించుకొని సోమవారం ఉదయం పటాన్చెరు మండలం రుద్రారం గ్రామ పరిధిలోని గణేష్ గడ్డ సిద్ధి వినాయక దేవాలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల పై స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, ఆలయ మాజీ ధర్మకర్తలు, ఈఓ లావణ్యతో సమీక్ష నిర్వహించారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. హాజరైన గ్రామ మాజీ సర్పంచ్ సుధీర్ రెడ్డి, రుద్రారం పిఎసిఎస్ చైర్మన్ పాండు, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, నరసింహ రెడ్డి, వెంకన్న, రాజు, హరిప్రసాద్ రెడ్డి, నాగరాజు, శ్రీనివాస్, గ్రామ పుర ప్రముఖులు, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

## జిన్నారం జంగంపేట రైతుల ఆవేదన

### రైతులకు మద్దతు తెలిపిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి



జిన్నారం, (శుభోదయం న్యూస్): జిన్నారం మండలంలోని సర్వేనెంబర్ 1 మరియు 376 జిన్నారం,జంగంపేట గ్రామ రైతులు తమకు న్యాయం జరగాలని డిమాండ్ చేస్తూ జిన్నారం తహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. జంగంపేట, జిన్నారం గ్రామాల్లోని అసైన్ భూములను జిహెచ్ఎంసి, టీజీఐఐసీకి అప్పగించిన తర్వాత, సంబంధిత అధికారులు రైతులకు కేవలం 600 గజాల సర్టిఫికెట్ ఇచ్చి బాధ్యత నుంచి తప్పించుకున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు పూర్తిస్థాయిలో పరిష్కారం చూపకుండా, భూమి నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని ఆరోపించారు. ఈ అన్యాయానికి అడ్డుకట్ట వేయాలని వారు కోరారు. రైతులు తమ సమస్యలను వివరంగా వివరించి వినతిపత్రాన్ని తహసిల్దార్‌కి అందజేశారు. దీనిపై తహసిల్దార్ జిహెచ్ఎంసికి సంబంధించిన భూమి సమస్యను 15 రోజులో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మాట్లాడుతూ.. ప్రభుత్వం, అధికారులు వెంటనే జోక్యం చేసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని అన్నారు. రైతులు అధైర్య పడవద్దని భరోసా ఇచ్చారు. నాయకులు శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, నరేందర్, కదీర్, కృష్ణ గౌడ్, రామకృష్ణ, శ్రీనివాస్ గౌడ్, శ్రీధర్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, భ్రమేందర్ గౌడ్, రైతులు మల్లేష్, వెంకటేష్, విఠల్,యాదయ్య, నర్సిములు, శ్రీనివాస్, రాంచంధర్,దుర్గయ్య, మహేష్, వెంకట్ రెడ్డి, ఈశ్వరయ్య, పోచయ్య, శ్రీనివాస్, దుర్గయ్యా, రమేష్, కృష్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## జిహెచ్ఎంసిలో పారిశుద్ధ్య పనులు నిర్వహణ




పటాన్చెరు : (శుభోదయం న్యూస్ ) : పటాన్చెరు లో జిహెచ్ఎంసి113 వ డివిజన్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని జిహెచ్ఎంసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక రివ్యూ సమావేశం కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ, పటాన్చెరు డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని ఆయన జిహెచ్ఎంసి అధికారులను కోరారు. ఆగస్టు 15న జరిగే స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా మరియు 16వ తేదీన జరగబోయే శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాల సందర్భంగా డివిజన్ పరిధిలోని ఆలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించాలని రాంకీ బృందం పారిశుద్ధ్య కార్మికులను కార్పొరేటర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేష్, ఏ ఎం ఓ హెచ్ డాక్టర్ విజయ్, సానిటరీ సూపర్వైజర్ పవన్, ఆంజనేయులు, స్వామి, భాస్కర్ రెడ్డి , రాంకీ బృందం ఎస్ ఎఫ్ ఏ యాదయ్య, ఎస్ ఎఫ్ ఏ సాయి కుమార్, ఎస్ ఎఫ్ ఏ హేమ పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టై బెల్టు అందజేత



వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణ కేంద్రంలోని బీసీ కాలనీలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు సోమవారం జిల్లా కాంగ్రెస్ నాయకుడు బత్తిని సహదేవ్ గౌడ్ టై బెల్టులను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు అదనపు తరగతి గదుల నిర్మాణానికి కృషి చేస్తానని ఆయన అన్నారు.విద్యార్థులు ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు పుట్టిన ఊరుకు మంచి పేరు తీసుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సంకోజు భాస్కర్,మాజీ ఎంపీపీ నూతి రమేష్ రాజ్, కంకల కృష్ణయ్య, కాసుల వెంకన్న, ఐటిపాముల రవి, బత్తిని పాండు,బత్తిని నాగేష్ గౌడ్, బత్తిని చిన్న నాగేష్ గౌడ్, ప్రధానోపాధ్యాయులు పెద్దిశ్రీధర్,ఉపాధ్యాయులు గులాం జిలాని, జ్యోతి,విద్యార్థిని విద్యార్థులు అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 18 న కాటమయ్య బోనాల పండగ



వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):వలిగొండ పట్టణ కేంద్రంలో గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన కాటమయ్య బోనాలను ఆగస్టు18 సోమవారం రోజున నిర్వహించేందుకు సోమవారం కులపెద్దల సమక్షంలో బోనాల తేదీనినిర్ణయించేందుకు గౌడ సంఘం అధ్యక్షుడు కొండూరు అంజయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.కాగా తేదీ18.08.2025 సోమవారం రోజున బోనాలను తీయుటకు కుల పెద్దలు నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో గీత కార్మిక సొసైటీ ప్రధాన కార్యదర్శి పబ్బు స్వామి గౌడ్, కోశాధికారి మారగోని సత్యనారాయణ, మునుకుంట్ల ధనంజయ,పబ్బు మల్లయ్య,మారగొని నరసింహ,పంజాల రమేష్,మారగోని బిక్షపతి,బత్తిని సత్యనారాయణ, దుబ్బ యాదయ్య, రాగిరు నరసింహ, రాగిరుసత్యనారాయణ,బత్తిని శేట్టయ్య, మారగోని రవి, శ్రీనివాస్,విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

## బీర్కూర్ లో గుర్తు తెలియని మృతదేహం లభ్యం



బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్):కామారెడ్డి జిల్లా బీర్కూర్ పట్టణ కేంద్రం లో బాజన్ చెరువు లో సోమవారం ఓ గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే బీర్కూరు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటికి తీయగా. సుమారు 45 నుండి 50 సంవత్సరాలు ఉండచ్చు అని పోలీసులు అంచనాకు వచ్చారు. ఎత్తు 5.5 రంగు చామనచాయ,బట్టతల ఉండి పసుపు ఆరెంజ్ కలరు చొక్కా నలుపు రంగు ప్యాంటు ధరించినట్టు పోలీసులు తెలిప్యారం మెడలో నల్లటి దారం,నడుపుకు ఎర్రని మొలతాడు ఉన్నట్టు స్థానిక పోలీసులు తెలిపారు. ఇట్టి మృతదేహాన్ని గుర్తుపట్టిన వారు ఉంటే బీర్కూర్ మండల పోలీసు స్టేషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ 8712686173,8712506869 నంబర్లకు సమాచారం అందించవలసింది గా తెలిపారు

## రామాయంపేటలో భారీ తిరంగా
## ర్యాలీ నిర్వహించిన బిజెపి నాయకులు



రామాయంపేట (శుభోదయం న్యూస్) ఆగస్టు 11:- మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో భారత్ అమృత ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా భారీ జాతీయ జెండాతో పాటు జాతీయ జెండాలను పట్టుకొని కళాశాల మైదానం నుండి పురవీధుల గుండా సిద్ధిపేట చౌరస్తా మీదుగా బస్టాండ్ వరకు బిజెపి నాయకులు ఏబీవీపీ నాయకులు విద్యార్థులు భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా బిజెపి అధ్యక్షులు వాల్దాస్ మల్లేశం గౌడ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజల్లో మాతృ దేశభక్తి రేకెత్తించడానికి తిరంగా ర్యాలీ నిర్వహించడం జరిగిందని ఐక్యమత్యం దేశభక్తి ఉంటేనే మన దేశాన్ని మనం రక్షించుకోగలమన్నారు.భారతదేశంలో ఉన్న ప్రజలు జాతీయత భావాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ఈనాడు భారతదేశంపై పొరుగు దేశాలు అమాయకులైన దేశ ప్రజలను తీవ్రవాదుల రూపంలో చంపివేయడం జరుగుతుందన్నారు.గతంలో ప్రభుత్వాలు చేయలేని సాహసాన్ని మన ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో జరిగిన హింసకాండకు బదులుగా పాకిస్తాన్ ను నిలువరించి ఆ దేశంలోకి చొచ్చుకపోయి దుండగులను హతమార్చారన్నారు.భారత సైన్యం అసమాన ప్రతిభతో చిన్నాభిన్నం చేయడంతో పాటు కాల్పులు జరిపిన



దుండగులను రెండు రోజుల్లో మట్టు పెట్టారన్నారు.ఈ ఐక్యమత్యం జాతీయత ప్రజలందరూ ఏకతాటిపై నిలబడి మోడీ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని కోరారు.ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేసి ఐక్యమత్యం చాటాలని కోరారు.ఈ తిరంగా ర్యాలీ ద్వారా ప్రజలు జాతీయ దినోత్సవం నాడే కాకుండా ఎల్లప్పుడు జాతీయభావాలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పట్టణ బిజెపి అధ్యక్షుడు శీలం అవినాష్ రెడ్డి,మండల అధ్యక్షులు నవీన్ గౌడ్ పార్టీ సీనియర్ నాయకులు జంగంపల్లి శంకర్ గౌడ్.అల్లాడి రమేష్.చింతలశేఖర్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిమ్మనమైన శ్రీనివాస్.ఎంఎల్ఎన్ రెడ్డి.ఓబిసి జిల్లా అధ్యక్షుడు గడ్డం కాశీనాథ్.బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సతీష్ రావు రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాగి రాములు,జిల్లా కౌన్సిల్ మెంబర్ వెలుముల సిద్ధరాములు పట్టణ ప్రధాన కార్యదర్శి మన్నే ప్రవీణ్ రాజ్.నాగరాజు.పట్టణ ఉపాధ్యక్షుడు మార్కు వెంకటేష్.మంగలి భరత్, ప్రశాంత్ గౌడ్.ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రశాంత్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో
## ఆల్బెండల్ జోల్ మాత్రలు అందజేత



రామాయంపేట (శుభోదయం న్యూస్) ఆగస్టు 11:- మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో డాక్టర్ హరిప్రియ ఆధ్వర్యంలో జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యకరమైన అలవాట్లు ఆనందకర బాల్యం 1 నుండి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు ఉచితంగా అందజేయడం జరిగిందన్నారు.మీ పిల్లలను నులిపురుగుల నుండి రక్షించుకోవలసిన అవసరం తల్లిదండ్రులకు ఎంతైనా ఉందన్నారు.మీ గోర్లు శుభ్రంగాను చిన్నవిగాను ఉంచుకోవాలని ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉండేటట్లు చూసుకోవాలన్నారు.పిల్లలు తినే పదార్థాలపై మూతలు పెట్టాలని,పండ్లు మరియు కూరగాయలను శుభ్రమైన నీటితో కడగి వండుకోవాలన్నారు.మీ చేతులను,ముఖ్యంగా భోజనం చేసేముందు మరియు మరుగుదొడ్డిని ఉపయోగించిన తరువాత శుభ్రంగా కడుకోవాలన్నారు.బహిరంగ మల విసర్జన చేయరాదని,ప్రతి ఒక్కరూ కుటుంబంలో మరుగుదొడ్డిని ఉపయోగించాలన్నారు.మీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని,మీ పిల్లలు పోషకాహార లోపం మరియు రక్తహీనతల వలన పిల్లలు ఎల్లప్పుడు అలసటగా ఉంటారని ఈ విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ హరిప్రియ,సిహెచ్ఓ కొండయ్య,హెచ్ఇఓ రామారావు,ఎంఎల్‌హెచ్‌పి సంధ్య,పిహెచ్ఎన్ రాణి,సూపర్‌వైజర్,ఉజ్వల,ఎఎన్ఎంలు ఆశవర్కులు పాల్గొన్నారు.

## గోల్పర్తి గ్రామంలో కొత్త రేషన్ కార్డులను
## అందజేసిన కాంగ్రెస్ నాయకులు



రామాయంపేట (శుభోదయం న్యూస్) ఆగస్టు 11:- మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని ఏడవ వార్డు గోల్పర్తి గ్రామంలో సోమవారం నాడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు మంజూరు చేసిన కొత్త రేషన్ కార్డులను 24 మంది లబ్ధిదారులకు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎర్రం సత్యం ఆధ్వర్యంలో అందజేశారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నుండి నిరుపేదలకు యువతకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అభివృద్ధి చెందే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్లడం చాలా అభినందనీయమన్నారు.అదేవిధంగా రాష్ట్రంలో కొన్ని ఏళ్ల తరబడి రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న పేదలందరికీ కొత్తగా రేషన్ కార్డులను మంజూరు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు.పేదలకు కొత్తగా రేషన్ కార్డులు మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నమన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సాదుల పరుశురాములు యూత్ కాంగ్రెస్ నాయకులు సాదుల కనకరాజ్ రొయ్యల స్వామి పాత నరేష్ పచ్చంటి రాము తొంటవాలి యాదగిరి పచ్చంటి యాదగిరి కుమ్మరి స్వామి తదితరులు పాల్గొన్నారు.

### బెదిరింపులకు పాల్పడిన యూట్యూబర్ ను
## రిమాండ్ కు తరలించిన పోలీసులు



రామాయంపేట (శుభోదయం న్యూస్) ఆగస్టు 11:- ఈ నెల 8న ఫిర్యాదుదారుడు ఎనిశెట్టి శ్రీకాంత్ వృత్తి లైసెన్సుడ్ సర్వేయర్ నార్సింగి ఎమ్మార్వో ఆఫీస్ నివాసం రెడ్డి కాలనీ రామాయంపేట గారి ఫిర్యాదు మేరకు బిఎన్ఎస్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడం జరిగిందని పోలీసులు తెలిపారు.ఈ దర్యాప్తులో భాగంగా ముద్దాయి పేరు ఓబులాష్ లింగం గౌడ్ వృత్తి రిపోర్టర్ నివాసం కౌడిపల్లి మెదక్ జిల్లా ఈనెల 7వ తేదీన తన యూట్యూబ్ ఛానల్ అయినా చరణ్ టీవీలో సర్వేయర్ అక్రమాలు అనే టైటిల్ తో ఒక వార్తను పోస్ట్ చేయడం జరిగిందని తెలిపారు.దీనిపైన మాట్లాడాల్సిందిగా ఫిర్యాదుదారుని భయభ్రాంతులకు గురి చేస్తూ అతని దగ్గర నుండి ఈ నెల 7న 5000 రూపాయలను ఫోన్ పే ద్వారా తీసుకున్నాడని పేర్కొన్నారు.తర్వాత రోజు 8న మెదక్ పిలిపించుకొని రెండు లక్షల డిమాండ్ చేస్తూ ఫిర్యాదారుని దగ్గర నుంచి 5000 నగదుతో పాటు గోల్డ్ రింగ్ ని కూడా బలవంతంగా తీసుకున్నాడని తెలిపారు.ఈ విషయంలో రామాయంపేట పోలీసులు వారు సాక్షాదారాలను సేకరించి ముద్దాయి లింగం గౌడ్ నుండి నేరంలో ఉపయోగించిన కారును మరియు గోల్డ్ రింగును స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.ఈ మేరకు సోమవారం నాడు నిందితుడుని అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్ కు తరలించినట్లు రామాయంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకట రాజాగౌడ్,ఎస్ఐ బాలరాజ్ విలేకరులకు తెలిపారు.

### పేద కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన
## వైఎస్ఆర్సిపి నాయకులు ఖాదర్ బాషా



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): పామూరు పట్టణ కరెంట్ ఆఫీస్ కాలనీలో నిరుపేద ముస్లిం యువకుడు సద్దాం పక్షవాతంతో బాధపడుతున్నారు అని విషయం తెలిసి మాజీ వాలంటీర్ ఫాతిమా ద్వారా సద్దాం కుటుంబముకు 10000 ఆర్థిక సహాయం చేసిన పామూరు మండల మాజీ వైఎస్ఆర్సిపి కన్వీనర్ ఖాదర్బాషా మరియు వారి ధర్మపత్ని రేష్మ. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఖాదర్ బాషా మిత్ర బృందం మరియు కరెంట్ ఆఫీస్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

### మోదడుగు వారి వివాహ వేడుకల్లో పాల్గొన్న.....
## కనిగిరి నియోజకవర్గ వాణిజ్య విభాగ అధ్యక్షులు పందిటి హరీష్



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): కందుకూరు పట్టణము జరిగినటువంటి మోదడుగు వెంకటేశ్వర్లు కుమార్తె వివాహ మహోత్సవానికి రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డుండి రాకేష్ తో కలసి నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేసిన కనిగిరి నియోజకవర్గ వాణిజ్య విభాగ అధ్యక్షులు పందిటి హరీష్. ఈ కార్యక్రమంలో తటవర్తి వాసు, మరియు వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### రెవెన్యూ సదస్సులో స్వీకరించిన
## దరఖాస్తులు వేగవంతం చేయాలి



పాపన్నపేట ఆగస్టు 11 శుభోదయం న్యూస్ - మల్లొడ్డికృష్ణ : భూభారతి అమలులో భాగంగా రెవిన్యూ సదస్సులలో స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని, ఇందిరమ్మ మోడల్ హౌస్ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. పాపన్నపేట మండలంలో తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులపై ఒక్కో గ్రామం వారీగా రెవెన్యూ అధికారులు, సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. వచ్చిన దరఖాస్తులలో ఆయా మాడ్యుల్స్ లో ఎన్ని అర్జీలు పరిష్కరించారు, ఎన్ని పెండింగ్ లో ఉన్నాయి, ఎంతమందికి నోటీసులు ఇచ్చారు, క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ పూర్తయ్యిందా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. భూభారతి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఆర్జీల పరిష్కారంలో జాప్యం జరుగకుండా రోజువారీగా దరఖాస్తుల పరిశీలనను పర్యవేక్షిస్తూ, వేగవంతంగా వాటిని పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఇందిరమ్మ మోడల్ హౌస్ ని పరిశీలించి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ఏడుపాయల హుండి ఆదాయం
## 26 లక్షల 59 వేల 9 రూపాయలు



పాపన్నపేట ఆగస్టు 11 శుభోదయం న్యూస్ మల్లొడ్డికృష్ణ: ఏడుపాయల వన దుర్గా భవాని దేవస్థానం నందు ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీ చంద్రశేఖర్ గారు మరియు దేవాదాయ శాఖ శ్రీమతి సులోచన స్పెషల్ ఆఫీసర్ సహాయ కమిషనర్ మరియు ఇండియన్ బ్యాంక్ మరియు వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. 46 రోజులకు గాను హుండీ ఆదాయం 26 లక్షల 59 వేల 009 రూపాయలు వచ్చెను. మిశ్రమ బంగారం 000.031.000 గ్రాముల మరియు మిశ్రమ వెండి 000.650.000 గ్రాములు వచ్చునుఈ కార్యక్రమంలో ఆలయ.కార్యనిర్వాహణాధికారి మరియు ఆలయ సిబ్బంది మరియు పాపన్నపేట పోలీస్ సిబ్బంది సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం నగర ప్రజలు బహిరంగ ప్రదేశాలలో చెత్త వేసినా, నిషేధిత ప్లాస్టిక్ వినియోగించినా జరిమానా

### అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మరియు రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ ఎ సి) జె. అరుణ శ్రీ



రామగుండం మండలం, రిపోర్టర్- (శుభోదయం న్యూస్): బహిరంగ ప్రదేశాలలో చెత్త వేసినా , నిషేధిత ప్లాస్టిక్ వినియోగించినా జరిమానా విధించాలని అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) %ు% రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ ( ఎఫ్ ఎ సి ) జె.అరుణశ్రీ ఆదేశించారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం పారిశుద్ధ్య పర్యవేక్షకులు, నీటి సరఫరా సిబ్బంది , మెప్మా సిబ్బంది , వార్డు అధికారులతో వేర్వేరుగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా పారిశుద్ధ్య పర్యవేక్షకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ రోడ్లు , కాలువలు , ఓపెన్ ప్లాట్ లలో చెత్త వేసి అపరిశుభ్రత కు కారణమవుతున్న వారి నుండి జరిమానా వసూలు చేయాలని అన్నారు . ప్రతి ఇంటి నుండి తడి చెత్త , పొడి చెత్త వేర్వేరుగా సేకరించేందుకు ఏర్పాట్లు చేయాలని అన్నారు. మురుగు నీటి కాలువల్లో పూడిక తీత , స్ప్రే , ఫాగింగ్ , ఆయిల్ బాల్స్ వేయడం వంటి అన్ని పనులు ప్రణాళికా బద్దంగా నియమిత షెడ్యూల్ ప్రకారం చేపట్టాలని అన్నారు. ప్రతి స్వచ్ఛ ఆటో పూర్తి సామర్థ్యంతో రెండు సార్లు డంపింగ్ యార్డ్ కు వెళ్లాలని అన్నారు. వాహనాలన్నిటినీ మంచి కండిషన్ లో పని చేసేలా చూసుకోవాలని అన్నారు. ఆరోగ్య శాఖ సిబ్బందిని సమన్వయం చేసుకొని జ్వరాలు ఎక్కువగా వస్తున్న ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. అనంతరం నీటి సరఫరా విభాగం సిబ్బందితో మాట్లాడుతూ పైప్ లైన్ లీకేజీ లను గుర్తించి వెంటనే మరమ్మత్తు చేయించాలని ఆదేశించారు. ప్రతి రోజు నిర్ణీత వేళల్లో ఒకే సమయానికి నీటి సరఫరా చేయాలని అన్నారు. ఒకే ఇంటికి రెండు నల్లా కనెక్షన్లు ఉంటే ఒకటి తొలగించాలని అన్నారు.



ప్రతి ఉపరితల ట్యాంక్ ఆవరణ పరిశుభ్రంగా ఉంచి మొక్కలు నాటాలని అన్నారు. మెప్మా ఆర్ పి లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ పద్దెనిమిది సంవత్సరాలు నిండిన నిరుపేద మహిళలకు గుర్తించి కొత్త స్వశక్తి సంఘాలు , సమాఖ్యలు ఏర్పాటు చేయాలని అన్నారు. వన మహోత్సవం కార్యక్రమం విజయవంతం చేయాలని అన్నారు. పి ఎం స్వ నిధి పథకం ద్వారా లబ్ది చేకూర్చుటకు అర్హులైన వీధి వ్యాపారులను గుర్తించాలని అన్నారు. రుణాలను రికవరీ చేయడంలో సహకరించి నాన్ పెరఫార్మింగ్ అసెట్స్ శూన్యం చేయాలని అన్నారు. స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించుకునే దిశగా స్వశక్తి మహిళలను ప్రోత్సహించాలని అన్నారు. వార్డు అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇంటి పన్నులు , లైసెన్స్ రుసులు చెల్లించి సహకరించేలా వినియోగదారులను చైతన్య పరచాలని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు . ఈ సమావేశాల్లో రామగుండం నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామన్ తదితరులు పాల్గొన్నారు. కాగా వంద రోజుల కార్యాచరణ లో భాగంగా నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది సోమవారం రామ్ నగర్ లో పరిసరాల పరిశుభ్రత , తడి చెత్త పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన కల్పించారు, అలాగే డి ఆర్ సి సి , క%శీ%పోస్ట్ యార్డ్ , డంపింగ్ యార్డ్ సందర్శించి అక్కడ పని చేస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు ఈ కార్యక్రమాల్లో ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మధుకర్, ఎం ఐ ఎస్ ఆపరేటర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు పాత్రికేయుల ఇళ్ల పట్టాల సాధన కోసం
## తాసిల్దార్ కు వినతి పత్రం !



శుభోదయం న్యూస్: మండలంలోని వివిధ దినపత్రికలలో పనిచేస్తున్న పాత్రికేయులకు ఇళ్ల పట్టాల మంజూరు కోసం నేడు (మంగళవారం) స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ రామనాథరెడ్డి కి వినతి పత్రం అంతజేయున్నట్లు మండల ఏపీయూడబ్ల్యూజే మండల అధ్యక్షులు గుమ్మల ధర్మారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ధర్మారెడ్డి మాట్లాడుతూ మండలంలో వివిధ దినపత్రికలలో గత కొన్నేళ్లుగా పనిచేస్తున్నారని పాత్రికేయుల న్యాయమైన సమస్యలపై ఎన్నోసార్లు స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో ఇళ్ల పట్టాల కోసం అర్జీలు సమర్పించుకొన్న ఇంతవరకు పాత్రికేయులకు న్యాయం జరగలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పాత్రికేయుల న్యాయమైన సమస్యలైన ఇంటి పట్టాలు, పక్కా గృహాలు, ఉచిత విద్య, ఆరోగ్య బీమా తదితరు సమస్యలపై స్థానిక తహసీల్దార్ కు డిమాండ్లతో కూడిన వినతి అందజేయున్నట్లు ఆయన ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, తాసిల్దార్ స్పందించి పాత్రికేయులకు ఇళ్ల పట్టాలు, ఒక్క గృహాల మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## ప్రతి ఒక్కరు .. దేశభక్తి నలుగు అలవర్చుకోవాలి!



శుభోదయం న్యూస్: భారత స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఆగస్టు 15 న మన భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన సందర్భంగా ప్రతి ఒక్కరు దేశభక్తి అలవర్చుకోవాలని రాష్ట్ర ఆర్గానిక్ అధ్యక్షులు చింత శరత్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా తిరంగా ర్యాలీని నిర్వహిస్తున్నారని ప్రతి ఒక్క పౌరుడు దేశం పట్ల భక్తి భావంతో మెలగాలన్నరుం. అలాగే విద్యార్థిని విద్యార్థులు దేశంపై భక్తి భావంతో స్వాతంత్ర సమరయోధులను నిత్యం స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో ముందుకు వెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు సురేందర్ రెడ్డి, గంగులప్పా, జూనియర్ కాలేజ్ అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నంజప్పకు సన్మానం!



శుభోదయం న్యూస్: మండల కేంద్రంలోని స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన నంజప్ప ను తహసిల్దార్ రామనాథరెడ్డి, జిల్లా పాత్రికేయుల నాయకులు ఎల్లంరాజు అధ్యక్షతన ఘనంగా సన్మానించారు. తొలిత మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నంజప్ప కు పూలమాలవేసి దుశ్యాలవ తో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా పాత్రికేయుల సంఘం నాయకులు ఎల్లం రాజు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు చెందిన ,మారుమూల ప్రాంతంలో ఉన్న నంజప్ప ప్రజల కోసం గత కొన్నేళ్లుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారని ఆయన గుర్తు చేశారు. సేవా కార్యక్రమాలు గుర్తించి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, స్థానిక శాసనసభ్యురాలు పల్లె సింధూర రెడ్డి నంజప్ప సేవలను గుర్తించి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గా నియమించడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సన్మాన కర్త నంజప్ప మాట్లాడుతూ పార్టీ అధిష్టానం మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యే సింధూర రెడ్డి నాకు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గా నియమించడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మండలంలోని రైతులకు గిట్టుబాటు ధర, నాణ్యమైన విత్తనాలు, రైతులకు సబ్సిడీతో విత్తన కాయలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే మండల ప్రధాన కార్యదర్శి నరసింహులు, ట్రెజరర్ శివరాం, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## దుగ్గిరాల గోపాలకృష్ణయ్య స్మార్కం ఏర్పాటు చేయాలి



చీరాల, శుభోదయం న్యూస్: ఆంధ్రరత్న శ్రీ దుగ్గిరాల గోపాలకృష్ణయ్య ఆశయాసాధన కమిటి మరియు శ్రీ వివేకానంద సేవా సమితి, చీరాల ఆధ్వర్యంలో చీరాల ఆర్డీవో ఆఫీస్ నందు ప్రజా సమస్యల పరిష్కర వేదికలో రెవిన్యూ డివిజనల్ అధికారి చంద్ర శేఖర్ వారినీ కలసి ఆంధ్ర రత్న దుగిరాల గోపాలకృష్ణయ్య చీరాల వారి స్మారక మందిరము నిర్మించుటకు స్థలముకొరకు ఆర్జీ అందించడం జరిగినది. శ్రీ దుగ్గిరాల గోపాలకృష్ణయ్య ఆశయాసాధన కమిటి కన్వీనర్ సర్విశెట్టి సుబ్బరామయ్య కో-కన్వీనర్ డాఎం తాడివలస దేవరాజు మాట్లాడుతూ ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, చీరాల-పేరాల ఉద్యమ నేత కీ?శే?




ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య చీరాల (1889-1928). వారి యొక్క స్థలము 20 ఎకరములు గతమునందు చీరాల రామనగర్ నందు ఉన్నది. వారు గతించిన తదుపరి శ్రీ మధాంధ్ర విద్యా పీఠగోష్ఠి, చీరాల వారు ఏ.పి.యస్. ఆర్.టి.సి చీరాల వారికి వర్క్ షాపు. గ్యారెజీ నిమిత్తం అమ్మినారు. పోగా మిగులు స్థలము 2 ఎకరములు ఉన్నది. ఆ స్థలమును సర్వే చేసి కమిటీ వారికి ఇప్పించవలసిందిగా ఆర్డీవో గారికి విజ్ఞప్తి చేశాము. ఆ స్థలం నందు ఆంధ్రరత్నవారి స్మారక మందిరము మరియు ప్రజాప్రయోగకరమైన ఆధ్యాత్మిక కార్యాక్రములు, ప్రజా సమావేశములు, గ్రంథాలయము, హాస్పిటల్, సుందరమైన పార్కు, శ్రీ కోదాండ రామాలయం నిర్మించగలమని తెలిపాము ఈ కార్యక్రమంలో కె. సాయి ప్రభాకరరావు, గుంటూరు హరిప్రసాదరావు, మువ్వల శివప్రసాదరావు, ఎం.ఎస్.ప్రసాద రావు కాకర్ల వెంకటేశ్వరరావు, శంకరశెట్టి నాగేశ్వరరావు, కోట శం కర నారాయణ, తడవర్తి చంద్ర పాల్గొన్నారు.

## తిరంగ్ బైక్ ర్యాలీ విజయవంతం



**చీరాల, శుభోదయం న్యూస్: ఆగస్టు 12,13,14 ప్రతి ఇంటిపైన జాతీయ జెండాను ఎగరవేయాలి. స్వతంత్ర దినోత్సవం ఆగస్టు 15 సందర్భంగా చీరాల నియోజకవర్గము వాడరేవు గ్రామం నుండి చీరాల గడియార స్తంభం వరకు బైక్ ర్యాలీని చీరాల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ 78వ స్వతంత్ర దినోత్సవం సందర్భంగా హర్ గర్ తిరంగా యాత్రలో భాగంగా ఆగస్టు 12 ,13 ,14 ప్రతి ఇంటి పైన కూడా మన జాతీయ జెండాన్ని ఎగర వేసే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించాలని బిజెపి నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చీరాల బిజెపి నాయకులు బండారు హేమంత్ కుమార్, నాసిన మనీ కుమార్, గుదంటి భవాని, డాక్టర్ తాడివలస దేవరాజు, కాకర్ల వెంకటేశ్వరరావు, శంకర శెట్టి నాగేశ్వరరావు, మేడికొండ భరణి రావు, గోలి సాయి, కృష్ణ అర్జున్ మరియు ఓడరేవు గ్రామ బిజెపి నాయకులు శ్రీనివాస గుప్త ,శ్రీనివాస్ రెడ్డి వెంకటేశ్వర రెడ్డి, రాజేష్ వైస్నవ్, కోకి ఏడుకొండలు, రామ్ బాబు,కోటి శ్రీను, సున్నపు జగన్, మూర్తి మూర్తి జొన్న , వంశీ కృష్ణ రెడ్డి , ధనుంజయ రెడ్డి, ఓడరేవు టిడిపి నాయకులు గురవయ్య, మరియు జనసేన నాయకులు పాల్గొన్నారు.**

## రాజ్యాంగాన్ని రక్షించేందుకు పోరాడతాం : రాహుల్‌గాంధీ



న్యూఢిల్లీ : బీహార్‌లో జరిగే ఎస్‌ఐఆర్ ప్రక్రియకు, 2024 లోక్‌సభ ఎన్నికల్లో జరిగిన అవకతకవలకు వ్యతిరేకంగా ఇండియా బ్లాక్ పార్టీల ఎంపీలు నేడు పార్లమెంటు నుంచి ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం వరకు మార్చ్ నిర్వహించేందుకు ప్రయత్నించారు. అయితే ఈ మార్చ్‌ను నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించింది. మార్చ్ జరిగే ప్రాంతంలో భారీగా పోలీసుల్ని మోహరించింది. దీంతో మార్చ్ ప్రారంభం అయి కాగానే.. నిరసన చేసే ఎంపీలను కాంగ్రెస్ నేత రాహుల్, శివసేన ఎంపీ సంజరు రౌత్, టిఎంసి ఎంపి సగారికాతోపాటు పలువురి ఎంపీలను పోలీసులు అరెస్టు చేశారు. అదుపులోకి తీసుకున్న ఎంపీలను బస్సు ఎక్కించి పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్టేషన్‌కు తరలించారు. కాగా, ఈ సందర్భంగా లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మీడియాతో మాట్లాడుతూ.. 'వాస్తవం ఏమిటంటే బిజెపి నేతలు నిజం మాట్లాడలేరు. అయితే నిజం ఏంటో దేశం ముందు ఉంది. ఈ పోరాటం రాజకీయమైనది కాదు. ఈ పోరాటం రాజ్యాంగాన్ని కాపాడటానికి. ఈ పోరాటం ఒక మనిషికి.. ఒక్క ఓటు కోసమే. మాకు కచ్చితమైన ఓటర్ల జాబితా కావాలి' అని ఆయన డిమాండ్ చేశారు. ఇక కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ మాట్లాడుతూ.. 'బిజెపి నేతలు భయపడుతున్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పిరికిది' అని ఆమె అన్నారు. ప్రతిపక్ష పార్టీల ఎంపీలు మార్చ్‌ను ప్రారంభించగానే అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బారికేడ్లను ఏర్పాటు చేసి పోలీసులు అడుగుడగునా అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఎస్‌పి నేత అఖిలేష్ యాదవ్ బారికేడ్లను దూకి మరీ మార్చ్‌ను కొనసాగించారు. పోలీసులకు, ఎంపీలకు జరిగిన ఘర్షణల్లో తోపులాట జరిగింది. ఈ తోపులాటలో మహిళా ఎంపీలు కిందపడిపోయారు. దీంతో ఎంపీలు రోడ్డుపైనే బైఠాయించి నిరసన చేశారు.

## ఎపిలో 3 రోజులు భారీ వర్షాలు



అమరావతి : ప్రస్తుతం దక్షిణ కోస్తాంధ్రపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఈ కారణంగా సోమవారం, మంగళవారం రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో పిడుగులతో పాటు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాలు, పాత హోర్డింగ్స్, విద్యుత్ స్తంభాల దగ్గర ప్రజలెవ్వరూ నిలబడకూడదని ప్రజలకు సూచించారు. పిడుగులు పడే ప్రమాదం ఉన్న కారణంగా రైతులు పొలాల్లో పనులు చేసే సమయంలో, పశువులను మేపే వేళలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. తాజా వాతావరణ అంచనాల ప్రకారం బుధవారం నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో బుధ, గురువారాల్లో దక్షిణ కోస్తాంధ్రలో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు సూచించింది. అల్పపీడనం బలపడితే గాలుల వేగం పెరిగి, సముద్రం ఆందోళనకర స్థితిలోకి మారవచ్చని హెచ్చరిక జారీ చేసింది. ఈ నేపథ్యంలో తీరప్రాంత మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సలహా ఇచ్చింది. ఈ వర్షాల ప్రభావం ముఖ్యంగా నెల్లూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, బాపట్ల, తెనాలి, ఒంగోలు, విశాఖపట్టణం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఎక్కువగా ఉంటుందని అంచనా వేసింది.

## దరఖాస్తులు తప్పితే దమ్మిడీ ఇచ్చింది లేదు..



**హైదరాబాద్, :** 'రైతు బీమా' పథకం పునరుద్ధరణకు గడువు దగ్గరపడింది. 2024-25 బీమా గడువు ఆగష్టు 13తో ముగుస్తుండగా.. 2025-26కి ప్రీమియం చెల్లిస్తే ఈ నెల 14 నుంచి కొత్త పాలసీ అమల్లోకి వస్తుంది. రైతు బీమా పథకంలో చేరే రైతులు స్వీయ ధ్రువీకరణ (సెల్ఫ్ డిక్లరేషన్) తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉంది. రైతులు తమతో పాటు నామినీకి చెందిన ఆధార్ కార్డు, పట్టా పుస్తకం దరఖాస్తుకు జతచేసి స్వయంగా వ్యవసాయశాఖ అధికారులకు ఇవ్వాలి. అర్జీలకు మరో మూడు రోజులే గడువు ఉండడంతో.. రైతులు తమ పనులు మానుకుని అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ప్రభుత్వంపై కౌంటర్ వేశారు. కాంగ్రెస్ పాలనలో పథకాల కోసం ప్రజలు పదే పదే దరఖాస్తు చేసుకోవడానికే సరిపోతుందని, ఒక్క పథకమూ అమలు కావడం లేదన్నారు. 'తిక్కలోడు తిరనాళ్లకు పోతే ఎక్కా, దిగా సరిపోయిందని.. అసమర్ధ, అవివేక కాంగ్రెస్ పాలనలో పథకాల కోసం ప్రజలు పదే పదే దరఖాస్తు చేసుకోవడానికే సరిపోతుంది తప్ప ఒక్క పథకమూ నిర్ధిష్టంగా అమలు కావడం లేదు. భూమిని నమ్ముకున్న రైతు ఏ కారణం చేత మరణించినా రూ.5 లక్షలు ఆ కుటుంబానికి అందించే రైతుబీమా పథకం 2018 నుండి కేసీఆర్ గారి ప్రభుత్వం అమలుచేస్తూ వస్తున్నది. పథకం ప్రారంభించినప్పటి నుండి 2023 డిసెంబర్ వరకు 1,11,320 రైతు కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున రూ.5,566 కోట్ల పరిహారం అందించడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుబీమా ప్రీమియం చెల్లించకుండా జాప్యం చేయడం మూలంగా వేలాది మంది రైతు కుటుంబాలు బీమా సాయం కోసం ఎదురు చూస్తున్నాయి. ప్రతి ఏటా ఆగస్టు 14తో రైతుబీమా ప్రీమియం గడువు ముగుస్తుంది. దీంతో ప్రభుత్వం ఎల్ఐసీకి ప్రీమియం చెల్లించి రెన్యువల్ చేయడం ఆనవాయితీ. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం గడువు దగ్గరకు వచ్చిన తర్వాత రైతుబీమా కోసం రైతు స్వయంగా స్వీయ ధ్రువీకరణ (సెల్ఫ్ డిక్లరేషన్) పత్రం అందజేయాలని, తనతో పాటు నామినీ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు అందజేయాలని నిబంధన పెట్టారు' అని కేటీఆర్ మండిపడ్డారు. 'రైతుబీమా రెన్యువల్‌కు కేవలం మూడు రోజుల గడువు మాత్రమే ఉన్నది. ప్రస్తుతం వ్యవసాయ పనులు జోరుగా నడుస్తున్నాయి. ఎరువులు దొరక్క రైతులు చెప్పులు, బుక్కులు లైన్లో పెట్టి పడిగాపులు కాస్తున్నారు. ఇలాంటి కీలక సమయంలో రైతుబీమాకు తిరిగి స్వయంగా రైతులు దరఖాస్తు చేయాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పడం మూర?త్వం. గతంలో చేసినట్లే రైతుబీమా రెన్యువల్ చేయాలి. దరఖాస్తు పేరుతో రైతులను ఇబ్బంది పెట్టవద్దని బీఆర్‌ఎస్ డిమాండ్ చేస్తున్నది. కాంగ్రెస్ పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారింది. ప్రతిపక్షాలు, ప్రజలు, రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు, నిరుద్యోగులు.. ఎవరి మీద విసురుతారో తెలియని పరిస్థితి నెలకొంది. దండగమారి కాంగ్రెస్ పాలనలో దరఖాస్తులు తప్పితే సామాన్యులకు ఈ సర్కారు దమ్మిడీ విదిల్చింది లేదు. బోగస్ మాటలు, బ్రోకర్ వేషాలు తప్ప 20 నెలల కాంగ్రెస్ పాలనలో సామాన్యులకు, తెలంగాణకు ఒరిగిందేమీ లేదు. జాగో తెలంగాణ జాగో' అంటూ కేటీఆర్ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు.

## హైడ్రాలో మార్షల్స్ సంచలన నిర్ణయం!



**హైదరాబాద్, :** హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ (హైడ్రా)లోని మార్షల్స్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. జీతాలు తగ్గించడంతో మార్షల్స్ విధులను బహిష్కరించారు. విధుల బహిష్కరణతో మాన్సూన్ ఆపరేషన్‌పై ప్రభావం పడింది. హైడ్రా కంట్రోల్ రూమ్ సేవలకు అంతరాయం కలిగింది. ట్రైనింగ్ కార్యక్రమం, ప్రజావాణి సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. హైదరాబాద్ నగరంలోని ప్రభుత్వ స్థలాలు, చెరువుల పరిరక్షణకు హైడ్రా కృషి చేస్తున్న విషయం తెలిసిందే. గత నెల 23న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు ఫిక్స్ చేస్తూ ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. ఈ జీవో ఆధారంగా మార్షల్స్‌కి రూ.22,500 జీతం అధికారులు ఫిక్స్ చేశారు. అంతకుముందు ఎక్కువ జీతాలు ఇస్తూ.. ఇప్పుడు తగ్గించడంతో హైడ్రా మార్షల్స్ నిరసన వ్యక్తం చేస్తున్నారు. జీతాలు తగ్గించడంతో హైడ్రాలోని మార్షల్స్ నేడు విధులను బహిష్కరించారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని 150 డివిజన్లలో సేవలు బంద్ అయ్యాయి. 51 హైడ్రా భారీ వాహనాల సేవలు నిలిచిపోయాయి. హైడ్రాలో ఎమర్జెన్సీ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. మాజీ సైనిక ఉద్యోగులు మార్షల్స్‌గా పనిచేస్తున్నారు. మార్షల్స్‌లో చాలా మంది మాజీ సైనికులు ఉన్నారు. వీరందరూ హైదరాబాద్ నగరంలో చెరువులు, నాలాలు, ప్రభుత్వ ఆస్తులను కాపాడటం, వర్షా కాలంలో వరదల సమస్యలను తగ్గించేందుకు పగలు రాత్రి అనే తేడా లేకుండా శ్రమిస్తారు. ఇటీవల వేతనాలను తగ్గించడంతో విధులను బహిష్కరించారు. దాంతో మాన్సూన్ ఆపరేషన్స్ సహా అనేక సేవలపై ప్రభావం కనిపిస్తోంది.

# నష్టాల్లో 81 విమానాశ్రయాలు!

### దశాబ్ద కాలంలో రూ.10,000 కోట్లకుపైగా నష్టం

### ఇవన్నీ ఏఏఐ నిర్వహణలో ఉన్న ఎయిర్‌పోర్టులే

### టాప్-10లో బేగంపేట, విజయవాడ, తిరుపతి

### ఏపీ, తెలంగాణలో నష్టాల్లో 7 ఎయిర్‌పోర్టులు




భారతీయ విమానాశ్రయాల నుంచి ఏటా కోట్ల మంది దేశ, విదేశాలకు విమానయానం చేస్తున్నారు. ఎయిర్‌పోర్టులూ పెరిగాయి. ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. విమానాశ్రయాల్లో రెస్టారెంట్లు, షాపింగ్ కేంద్రాలు విస్తరించాయి. వీటి వ్యాపారం, ప్రయాణికుల రాకపోకలు, వాహనాల పార్కింగ్ ఫీజు, ఇతర ఆదాయాలతో విమానాశ్రయాలు లాభాల జడివానలో తడిసిపోతున్నాయి అనుకుంటే పొరపాటే. భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా-ఏఏఐ) నిర్వహణలో ఉన్న 81 విమానాశ్రయాలు నష్టాల్లో ఉన్నాయి. దశాబ్ద కాలంలో ఇవి రూ.10 వేల కోట్లకుపైగా నష్టాన్ని మూటగట్టుకోవడం గమనార్హం. వీటిలో 22 విమానాశ్రయాల్లో కార్యకలాపాలు నిలిచిపోయాయి. నష్టాల జాబితాలో ఉన్న ఏఏఐ ఎయిర్‌పోర్టుల్లో తెలుగు రాష్ట్రాల నుంచి ఏడు ఉన్నాయి. ఇటీవల కేంద్ర పౌర విమానయాన శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. 2015-2016 నుంచి 2024-2025 మధ్య దేశవ్యాప్తంగా ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అధీనంలో ఉన్న 81 విమానాశ్రయాలు మొత్తం రూ.10,852.9 కోట్ల నష్టాన్ని చవిచూశాయి. ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ విమానాశ్రయం అత్యధికంగా రూ.673.91 కోట్లు నష్టపోయింది. ఆ తర్వాతి స్థానాల్లో అగర్తల, బేగంపేట (హైదరాబాద్), డెహ్రాడూన్, విజయవాడ విమానాశ్రయాలు ఉన్నాయి. రూ.363 కోట్ల నష్టంతో తిరుపతి 8వ స్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి రూ.339.16 కోట్లు, కడప రూ.103.39 కోట్లు, ప్రకాశం జిల్లాలోని దొనకొండ రూ.1.84 కోట్లు, తెలంగాణలోని వరంగల్ రూ.5.76 కోట్ల నష్టాన్ని నమోదుచేశాయి. సఫ్దర్‌జంగ్ విమానాశ్రయం నుంచి ప్రస్తుతం వాణిజ్య విమానాలు కార్యకలాపాలు సాగించడం లేదు. ఇక్కడి నుంచి ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి వీవీఐపీలను తీసుకెళ్లడానికి మాత్రమే ఉపయోగిస్తున్నారు.

**13 కోట్లకు పైచిలుకు..**

ఏఏఐ ఖాతాలో దేశవ్యాప్తంగా మొత్తం 133 ఎయిర్‌పోర్టులు ఉన్నాయి. ఇందులో 35 విమానాశ్రయాల నుంచి అంతర్జాతీయ విమాన సర్వీసులు నడుస్తున్నాయి. రెండు జాయింట్ వెంచర్, ఆరు పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విమానాశ్రయాలు మినహా.. మిగిలిన ఎయిర్‌పోర్టుల నుంచి 2023-24లో 13 కోట్లకుపైచిలుకు ప్రయా ణికులు దేశ, విదేశాలకు రాకపోకలు సాగించారు. 6.88 లక్షల మెట్రిక్ టన్నుల సరుకు రవాణా అయింది.

**బేగంపేటలో ఇలా..**

ఇక బేగంపేట విమానాశ్రయం నుంచి వాణిజ్య విమానాలు నడపడం లేదు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్ గానూ ఈ ఎయిర్‌పోర్ట్ సేవలు అందిస్తోంది. అలాగే ప్రైవేట్ విమాన సర్వీసులు ఇక్కడి నుంచి విరివిగా నడుస్తున్నాయి. 2008 మార్చి 23న శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభమైన తర్వాత బేగంపేట ఎయిర్‌పోర్టు అన్ని వాణిజ్య కార్యకలాపాలను నిలిపివేసింది. అతిపెద్ద పౌర విమానయాన ప్రదర్శనకు రెండేళ్లకోసారి బేగంపేట విమానాశ్రయం వేదిక అవుతోంది.

**రూ.96 వేల కోట్ల వ్యయం**

ప్రయాణికుల సంఖ్య ఏటా పెరుగుతున్న నేపథ్యంలో కొత్త ఎయిర్‌పోర్టులు, ఉన్న వాటి విస్తరణ, కొత్త టెర్మినళ్లు, ఇతర సౌకర్యాల కల్పన వంటి వాటికోసం 2019-20 నుంచి 2024-25 మధ్య ఏఏఐ, పీపీపీ భాగస్వాములు కలిపి రూ.96,000 కోట్ల మూలధన వ్యయం చేశాయి. ఇందులో ఏఏఐ వాటా రూ.25,000 కోట్లు.తెలుగు రాష్ట్రాల్లో మూడు.. మూతపడ్డ విమానాశ్రయాల్లో తెలంగాణ నుంచి నాదర్‌గుల్, వరంగల్‌బీ ఏపీ నుంచి దొనకొండ ఉన్నాయి.

**ఉడాన్ పథకంతో..**

దేశంలోని సేవలు లేని, తక్కువ సేవలు అందిస్తున్న విమానాశ్రయాల నుంచి ప్రాంతీయ విమాన కనెక్టివిటీని పెంచడానికి 2016 అక్టోబర్ 21న ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్ (ఆర్‌సీఎస్-ఉడాన్ ) పథకం ప్రారంభమైంది. నిర్వహణ ఖర్చులు, అంచనా ఆదాయాల మధ్య అంతరాన్ని తగ్గించడానికి విమానయాన సంస్థలకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్‌ను ఈ పథకం కింద ప్రభుత్వం అందిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, విమానాశ్రయ నిర్వాహకుల నుంచి విమానయాన సంస్థలకు ఆర్థిక ప్రోత్సాహకాలు, రాయితీలు లభిస్తాయి. తద్వారా నిర్వహణ ఖర్చులను తగ్గించి వారి కార్యకలాపాలను ప్రోత్సహించవచ్చన్నది ప్రభుత్వ భావన. 2025-2026 ఆర్థిక సంవత్సరానికి ఆర్‌సీఎస్-ఉడాన్ కోసం కేంద్రం రూ.300 కోట్ల బడ్జెట్ కేటాయించింది. 15 హెలిపోర్ట్‌లు, రెండు వాటర్ ఏరోడ్రోమ్స్ సహా మొత్తం 92 సేవలు లేని, తక్కువ సేవలు అందించే విమానాశ్రయాలను ఉడాన్ కింద పూర్తి స్థాయి వినియోగంలోకి తీసుకొచ్చారు.

# మన ఆదాయం పెరిగింది!

- సగానికి తగ్గిన అల్ప ఆదాయ దేశాల సంఖ్య
- రెండింతలకుపైగా పెరిగిన సంపన్న దేశాలు
- వెల్లడించిన ప్రపంచ బ్యాంక్ 1987-2024 లెక్కలు
- 2007లో 'దిగువ మధ్య ఆదాయ దేశం'గా భారత్
- అంతవరకు 'అల్పాదాయ దేశాల' జాబితాలో..



కాలం వేగంగా పరుగెడుతోంది. అందుకు తగ్గట్టుగా సాంకేతికంగానే కాదు, ఆర్థికంగానూ మార్పులను చూస్తున్నాం. ప్రజల జీవన ప్రమాణాలు చాలా మెరుగయ్యాయి. సగటు ఆదాయాలూ పెరుగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 1987లో అల్పాదాయ దేశాలు 49 ఉంటే.. 2024 నాటికి ఈ సంఖ్య దాదాపు సగానికి వచ్చిందంటే అభివృద్ధి దిశగా ఏ స్థాయిలో మార్పులొచ్చాయో అర్థం చేసుకోవచ్చు. మనదేశం గత 20 ఏళ్ల కాలంలో విశేష పురోగతి సాధించింది. ప్రపంచ బ్యాంకు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. ఒకప్పుడు అల్పాదాయ దేశాల జాబితాలో ఉన్న మనదేశం.. 2007లోనే దిగువ మధ్య ఆదాయ దేశంగా అవతరించడం విశేషం. 1987లో అల్పాదాయ దేశాల జాబితాలో ఉన్న దక్షిణాసియాలోని ఆరు దేశాల్లో 2024 నాటికి అయిదు దేశాలు దిగువ మధ్య దేశాల జాబితాలోకీ, ఒకటి ఎగువ మధ్య దేశాల జాబితాలోకీ చేరాయి. 37 ఏళ్లలో అల్పాదాయ దేశాల సంఖ్య సగానికి పడిపోవడం ప్రజల ఆదాయాల పెరుగుదల తీరుతెన్నులకు అద్దం పడుతోంది. ఇక ఎగువ మ ధ్య తరగతి దేశాలు 28 నుంచి 54కు చేరాయి. అధిక ఆదాయ దేశాల సంఖ్య 41 నుంచి రెండింతలకుపైగా దూసుకెళ్లి 87 అయ్యాయి.

**తగ్గిన పేదలు..:** 2004-24 మధ్య ఎగువ మధ్య ఆదాయ గ్రూప్ దేశాల జనాభా 8.9 నుంచి 34.7%కి ఎగబాకడం గమనార్హం. 2004లో అల్పాదాయ గ్రూప్ దేశాల్లో నివసించిన జనాభా 37.4% ఉండగా.. రెండు దశాబ్దాల్లో ఇది 7.6%కి దిగొచ్చింది. అయితే యుద్ధాలు, ఆర్థిక సంక్షోభాలు ఆదాయాల్లో ఒక మెట్టు దిగేలా చేస్తాయనడానికి సిరియా, యెమెన్ ఉదాహరణ. 2017లో తక్కువ-మధ్య ఆదాయ గ్రూప్ నుంచి ఇవి అల్పాదాయ గ్రూప్‌నకు వచ్చాయి.

**నాలుగు గ్రూపులుగా..:** ప్రపంచంలోని దేశాలను.. ప్రపంచ బ్యాంకు ఏటా తలసరి స్థూల జాతీయ ఆదాయం (జీఎన్ఐ) ఆధారంగా అల్ప, దిగువ-మధ్య, ఎగువ-మధ్య, అధిక-ఆదాయ దేశాలుగా వర్గీకరిస్తోంది. 2025-26 (2025 జూలై-2026 జూన్) సంవత్సరానికిగాను ప్రపంచవ్యాప్తంగా 216 దేశాల జాబితా విడుదల చేసింది. తలసరి జీఎ న్ ఐ అనేది విదేశీ సంపాదనతో సహా ఏదైనా దేశంలోని జనాభా సగటు ఆదాయానికి కొలమానం. రాయితీ రుణాలకు ఏ దేశాలు అర్హమైనవో నిర్ణయించడానికి సగటు ఆదాయాలను ప్రపంచ బ్యాంకు పరిగణనలోకి తీసుకుంటోంది.

యూరప్, మధ్య ఆసియా: 1987%-%2024 మధ్య తక్కువ ఆదాయ దేశం ఒక్కటీ లేదు. అధిక ఆదాయ దేశాల శాతం 71 నుంచి 69కి తగ్గింది.

తూర్పు ఆసియా, పసిఫిక్: 1987లో 26% దేశాలు తక్కువ ఆదాయ గ్రూప్‌లో ఉండగా.. 2024 నాటికి కేవలం 3%కి తగ్గాయి.

లాటిన్ అమెరికా, కరేబియన్: తక్కువ ఆదాయ దేశాలు 2 నుండి సున్నాకి వచ్చాయి. అధిక ఆదాయ దేశాలు 9% నుంచి 46%కి పెరిగాయి.

మధ్యప్రాచ్యం, ఉత్తర ఆఫ్రికా: తక్కువ ఆదాయ దేశాలు 2 నుండి 3కి పెరిగాయి. అధిక ఆదాయ దేశాలు 35%కి చేరాయి.

సబ్-సహారన్ ఆఫ్రికా: తక్కువ ఆదాయ దేశాలు 75% నుండి 45%కి తగ్గాయి. ఒక దేశం అధిక ఆదాయ గ్రూప్‌లో చేరింది.




# ఇది దేనికి సంకేతం?



శకునాలను భావి పరిణామాలకు సంకేతాలుగా భావిస్తారు. శకునాల మీద నమ్మకాలు పురాతన కాలం నుంచి ఉన్నాయి. ఈ నమ్మకాలు ఏ ఒక్క దేశానికో, మతానికో పరిమితమైనవి కావు. ప్రకృతిలో అనుకోని ఉత్పాతాలు సంభవిస్తే, వాటిని దుశ్శకునాలుగా భావిస్తారు. ఎలాంటి శకునాలకు ఎలాంటి ఫలితాలు సంభవిస్తాయో చెప్పే శకున శాస్త్రాలు కూడా ఉన్నాయి. శకునాలకు వ్యాఖ్యానాలు చెప్పి, భవిష్యత్తును అంచనా వేసే జ్యోతిషులు, కాలజ్ఞానులు కూడా ప్రపంచంలో ఉన్నారు. శకునాల మీద నమ్మకాలు పురాతన సమాజంలో ఎంతగా ఉండేవో, శకునాలన్నీ ఉత్తవేనని కొట్టిపారేసే హేతువాదులు పురాతన కాలం నుంచి ఉన్నారు. 'దేశ ప్రయోజనాల కోసం కత్తి దూసే యోధుడు శకునాన్ని చూసుకోడు' అన్నాడు గ్రీకు తత్త్వవేత్త, కవి హోమర్. క్రీస్తు పూర్వం ఎనిమిదో శతాబ్దికి చెందిన ఆయన ఆనాటి హేతువాదానికి ప్రతినిధి. శకునాల మీద నమ్మకాలు బలంగా ఉన్న ప్రాచీన సమాజంలోనే హేతువాదం కూడా పురుడు పోసుకుందనేందుకు హోమర్ మాటలే ఉదాహరణ. ఆనాటికీ ఈనాటికీ కాలం ఎంతో మారింది. ఆధునికత పెరి గింది. అన్ని రంగాల్లోనూ కృత్రిమ మేధ శరవేగంగా కమ్ముకొస్తోంది. అయినా ఇప్పటికీ శకు నాలను పట్టించుకోని హేతువాదుల కంటే శకునాలను నమ్మేవారి సంఖ్యే ఎక్కువగా ఉంటోంది. మన పురాణాలను చూసుకుంటే, శకునాల వర్ణన దాదాపుగా ఒకే తీరులో కనిపిస్తుంది. లోకకంటకులైన దుర్మార్గులు భూమ్మీద పుట్టినప్పుడు ఆకాశంలోని చుక్కలు తెగి రాలిపడటంబీ నక్కలు ఊళలు పెట్టడంబీ కుక్కలు మొరగడంబీ గాడిదలు ఓండ్రపెట్టడంబీ సముద్రాలు ఘూర్ణిల్లడంబీ తుపానులు చెలరేగడం వంటి ఉత్పాతాలు సంభవించేవి. దుర్యోధనుడు పుట్టినప్పుడు ఇలాంటి దుశ్శకునాలే కనిపించాయట! ఆపదలు ఎదురయ్యే ముందు దుశ్శకునాలు గోచరిస్తాయని చాలామంది నమ్ముతారు. రామ రావణ యుద్ధంలో రావణుడి కొడుకు మేఘ నాదుడు లక్ష్మణుడి చేతిలో హతమయ్యాడు. చివరకు రావణుడే స్వయంగా రణరంగానికి బయలుదేరాడు. అప్పుడు నక్కలు ఊళలు పెట్టడంబీ గద్దలు రథం మీద గిరికీలు కొడుతూ తిరగడంబీ గుడ్లగూబలు వికృత రావాలు చేయడంబీ రథం మీది గొడుగు విరిగిపోవడం వంటి దుశ్శకునాలు ఎదురయ్యాయట! చివరకు ఆ యుద్ధంలో రావణుడు హతమైపోయాడు. రామాయణ, మహాభారతాలు సహా అనేక పురాణాల్లో ఉన్న ఇలాంటి కథల మూలంగా శకునాల మీద నమ్మకాలు జనాల్లో తరతరాలుగా నాటుకుపోయాయి. పురాణ కాలంలోనే శకున శాస్త్రాన్ని గర్గ మహాముని రాశాడట! 'స్మృతౌ శాస్త్రే వైద్యే శకున కవితాగాన ఫణితౌ/ పురాణే మంత్రే వా స్తుతి హాస్యే ష్వచతురః/ కథం రాజ్ఞాం ప్రీతిర్భవతి మయి కోహం పశుపతే/ పశుం మాం సర్వజ్ఞ ప్రథిత కృపయా పాలయ విభో' అని 'శివానంద లహరి'లో ఆదిశంకరాచార్యుడు అన్నాడు. అంటే, 'శాస్త్ర పాండిత్యం లేదు. వైద్యం చేతగాదు. శకున శాస్త్రం రాదు. కవిత్వం చెప్పలేను. సంగీతం రాదు. పురాణం చెప్పలేను. మంత్రాలెరుగను. ఆటపాటలలో నేర్పు లేదు. హాస్యం చెప్పలేను. ఇలాంటి సామాన్యుడినైన నా మీద రాజులకు ఎలా దయ కలుగుతుంది? వారిచ్చే ఫలాలు నాకేల? సర్వజ్ఞా! నన్ను నేనే ఎరుగని పశువును. నువ్వు పశుపతివి కదా! నన్ను నువ్వే దయతో కాపాడు' అని పరమశివుడిని వేడుకున్నాడు. ఈ శ్లోకంలోని పారమార్థిక తాత్పర్యం ఎలా ఉన్నా, ఆదిశంకరాచార్యుని కాలంలో రాజాశ్రయం పొందడానికి అవసరమైన కీలక విద్యలలో శకునశాస్త్రం కూడా ఒకటని మనకు అర్థమవుతుంది. తాజాగా గలిలీ సముద్రంలోని నీరు నెత్తుటిలా ఎర్రబడింది.

బైబిల్‌లో ప్రస్తావించిన ఈ సముద్రం అకస్మాత్తుగా ఎర్రబడటంపై అక్కడి జనాలు ప్రపంచానికి ఏ ముప్పు ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ఏసుక్రీస్తు గలిలీ సముద్రం మీద నడిచి, తుఫాను శాంతింపజేశాడనిబీ ఆ సముద్రం ఒడ్డునే తన శిష్యులకు అనేక బోధలు చేశాడనిబీ ఐదువేల మందికి రొట్టెలు, చేపలతో ఆహారం పెట్టాడని బైబిల్ కథనం. ఇదిలా ఉంటే, బానిసలుగా ఉన్న ఇజ్రాయెలీలను విముక్తులను చేసేందుకు ఈజిప్టు ఫారో అంగీకరించనందుకు ఆగ్రహించిన భగవంతుడు అందుకు హెచ్చరికగా నైలునదీ జాలాలను నెత్తుటిలా ఎర్రగా మార్చేశాడని పాత నిబంధన గ్రంథం చెబుతోంది. ఆ కథనమే ఇప్పటి ఆందోళనకు కారణం. మన దేశ పరిస్థితులను చూసుకుంటే, ఏడున్నర దశాబ్దాలకు పైబడిన స్వతంత్ర భారత చరిత్రలో ఎన్నడూ లేని విధంగా దొంగ ఓట్ల వ్యవహారంలో ఎన్నికల కమిషన్ నిండా బురదలో మునిగింది. ఒక హైకోర్టు న్యాయమూర్తి ఇంట నోట్ల కట్టలు దొరికిన ఉదంతం సుప్రీంకోర్టుకు చేరింది. రాజ్యాంగ వ్యవస్థలు ఇలా కళంకితం కావడం దేశానికి ఒక రకంగా దుశ్శకునాలు. ఇవి ఎలాంటి దుష్పరిణామాలకు సంకేతాలో కాలమే చెప్పాలి.

